
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 24 ఆగస్టు 2025
5

టూరిజం హబ్‌గా అటవీ ప్రాంతాలు

- భద్రాద్రి కలెక్టర్ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో పర్యటన
- రథంగుట్ట, కిన్నెరసాని, ఊరగుట్టల పరిశీలన



7

30న బెండాలపాడులో సీఎం పర్యటన!



అశ్వారావుపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామంలో ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈనెల 21న బెండాలపాడులో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించి.. ఇందిరమ్మ గృహాల ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. గృహ ప్రవేశాల అనంతరం లక్ష మందితో జరిగే బహిరంగ సభలో పాల్గొనాలి. ఇందుకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేయగా.. అనివార్య కారణాల వల్ల సీఎం పర్యటన రద్దు అయ్యింది. ఈ నేపథ్యంలో ఈ నెల 30వ తేదీన తిరిగి సీఎం పర్యటన ఖరారైనట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు తిరిగి ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా.. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

భద్రాద్రిలో పదోన్నతి జాతర

- 24 మంది హెడ్‌మాస్టర్లకు ఉద్యోగోన్నతి
- ఈ నెల 26న స్కూల్ అసిస్టెంట్స్‌గా బాధ్యతలు
- జిల్లాలో 212 మందికి వర్తింపు

7

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి పథకాన్ని ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసేందుకు సర్వే సాగుతోంది. ఈ మేరకు తెలంగాణ పునరుత్పత్తి ఇంధన వనరుల శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో సర్వే నడుస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లోని పై భాగంలో ఖాళీ ప్రదేశాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేసి తద్వారా వచ్చే విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు సరఫరా చేయనున్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభించనుంది. ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సోలార్ విద్యుత్‌ను వినియోగించుకొని కరెంట్ బిల్లుల భారాన్ని తగ్గించు కోబోతున్నారు. ఇటు ప్రభుత్వ అవసరాలకు విద్యుత్ వినియోగంతో పాటు మిగిలిన విద్యుత్ అమ్మకాల ద్వారా అదనపు ఆదాయం కూడా రానుంది.



ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ వెలుగులు

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న సర్వే
- భవనాలపైనా సోలార్ విద్యుత్ ఉత్పత్తి
- నెలాఖరులోగా ప్రణాళిక సిద్ధం

ఖమ్మం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ, మండల పరిషత్ కలెక్టరేట్‌లు, కాలేజీలు, పాఠశాల భవనాలు అన్ని ప్రభుత్వ శాఖల భవనాలను గుర్తిస్తున్నారు. భవనాల పై భాగంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన యూనిట్లను నెలకొల్పడం ద్వారా భవనాల పై గల ఖాళీ ప్రదేశాలను వినియోగంలోకి తీసుకు రావడంతో పాటు భవనాలకు ఎండ వేడి తగ్గించడం, వర్షాలు పడినప్పుడు కూడా భవనాలపై నీరు లేకుండా వెళ్లిపోవడం.. ప్రభుత్వ కార్యాలయాలపై భవనాలపై శుభ్రంగా ఉంచడం వంటి వాటిని చేయనున్నారు. ఈ మేరకు ఈనెలాఖరులోగా సర్వే పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. ఖమ్మం జిల్లా పరిధిలో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి 4725 సర్వీసులుండగా.. 29.36మె.వా. విద్యుత్ అవసరం ఉంటుంది. ఈ మేరకు విద్యుత్ ఉత్పత్తికి రూఫ్ టాప్ సోలార్ ప్లేట్లను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ ప్లేట్లు అమర్చాలంటే రూ.60వేల ఖర్చు వస్తుంది. రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లను ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై ఏర్పాటు చేయడం ద్వారా 25 ఏళ్లకు పైగా నిరంతర విద్యుత్ ఉత్పత్తి జరగనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 4580 ప్రభుత్వ విద్యుత్ సర్వీసులున్నాయి. 83.35మె.వా. విద్యుత్ ఇక్కడ వినియోగంలో ఉంది. ఈ మేరకు సోలార్ విద్యుత్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ జిల్లాలో హైటెన్షన్ కనెక్షన్లు అధికంగా ఉండడంతో.. పరిశ్రమలకు విద్యుత్ అవసరం ఎక్కువగా ఉంది. కాగా.. ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలపైనా రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి యూనిట్లను ఏర్పాటు చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు రెడ్‌కో జిల్లా మేనేజర్ పొలిశెట్టి అజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై, ఖాళీగా ఉన్న ఏరియా లెక్కలు తీసుకుంటున్నామన్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలో ఎన్ని మె.వా. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందో పరిశీలిస్తున్నామని తెలిపారు. భవనాలపై ఉన్న ఖాళీ ప్రదేశాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా పెద్దఎత్తున విద్యుత్ ఆదా అవుతుందని చెప్పారు. అలాగే మిగులు విద్యుత్‌ను అమ్మకం ద్వారా ఆదాయం వస్తుందని అజయ్ కుమార్ తెలిపారు.



ఖమ్మం ఎన్ఎస్‌పీలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌పై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సర్వే చేస్తున్న దృశ్యం

13న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఉమాదేవి

ఖమ్మం లీగల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అత్యధిక కేసుల పరిష్కారం, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 13న జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయాధికారి కె.ఉమాదేవి అన్నారు. శనివారం ఖమ్మం న్యాయ సేవాధికార సంస్థలో న్యాయాధికారులు, పోలీస్, ఇన్సూరెన్స్ కంపెనీలు, సఖి, భరోసా అధికారులు, న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకునేందుకు ఎలాంటి రుసుము (మిగతా 6వ పేజీలో)

ఆవు పేడతో వినాయక విగ్రహాలు

- టేకులపల్లి గోశాలలో తయారీ
- పర్యావరణ హితమంటున్న నిర్వాహకులు

6

మట్టి ప్రతిమల వినియోగంపై

ప్రచారమేదీ?

గెలిచి.. నిలిచారు!

- ప్రేమించి.. పోరాడి పెళ్లి చేసుకున్నారు
- మహిళా శక్తి క్యాంటీన్‌తో స్వయం ఉపాధి
- స్వయం శక్తితో దిగ్విజయంగా ముందుకు..
- ఆదర్శంగా నిలుస్తున్న ధనలక్ష్మీ, గోపి దంపతులు

సండే స్పెషల్ SUNDAY SPECIAL



7

మార్కెట్‌లో మాయగాళ్లు





- దొంగ బిల్లులతో మార్కెట్ ఫీజు ఎగనామం
- ఇప్పటికే భారీగా ఫీజులు ఎగ్గొట్టిన పలువురు వ్యాపారులు
- తాజాగా ఓ వ్యాపారికి చెందిన బిల్లు పుస్తకాలు నకిలీవి ముద్రించి వ్యాపారం
- అడ్డంగా దొరికిన మరో వ్యాపారి
- ఎంకే ట్రేడర్స్ ఫరంపై కేసు నమోదు

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో మాయగాళ్లు రెచ్చిపోతున్నారు. ఓ వైపు రైతులను, మరో వైపు మార్కెట్ అధికారులను పత్తి వ్యాపారులు నిలువునా మోసం చేస్తున్నారు. రైతుల పంటను తక్కువ ధరకు కొనుగోలు చేయడమే కాకుండా ఆ పంటపై మార్కెట్‌కు చెల్లించాల్సిన ఒక శాతం మార్కెట్ ఫీజు సైతం చెల్లించకుండా ఎగ్గొట్టేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఖమ్మం మార్కెట్‌లో పత్తి వ్యాపారం చేసే ఎంకే ట్రేడర్స్ యజమాని మరో వ్యాపారికి చెందిన బిల్లు(సెస్) పుస్తకాలపై దొంగ వ్యాపారం చేస్తూ అడ్డంగా దొరకడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సదరు ఎంకే ట్రేడింగ్ కంపెనీ 2023 సంవత్సరంలో ఖమ్మం మార్కెట్‌లో పత్తి కొనుగోలు చేసి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మార్కెట్ పరిధిలోని ప్రముఖ సంస్థకు పత్తిని అమ్మారు. కాగా.. ఆ సంస్థ తన రాష్ట్రంలో ఇన్‌పుట్ టాక్స్ కోసం, ఇతరత్రా క్లియరెన్స్‌ల కోసం ప్రయత్నించగా.. అది టాలీ కాకపోవడంతో బిల్లు సరైనదా!? కాదా !? అన్న అనుమానంతో అక్కడి నుంచి ఆయా నకిలీ బిల్లుపై విచారణ చేసి నిగ్గు తేల్చాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పంపడంతో విషయం బట్టబయలైంది. దీంతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నకిలీ బిల్లుపై ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

దొంగ బిల్లులతో మార్కెట్ ఫీజు ఎగనామం

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలో లైసెన్సులు కలిగిన కొంత మంది వ్యాపారులు దొంగ బిల్లులతో వ్యాపారాలు చేస్తూ మార్కెట్‌కు రావాల్సిన ఒక శాతం ఫీజును సైతం ఎగ్గొడుతున్నారని మార్కెట్ వ్యాపార వర్గాలు బహిరంగంగానే పేర్కొంటున్నాయి. దీంతో మార్కెట్‌కు ఏడాదికి సుమారు 2కోట్ల నుంచి రూ. 5 కోట్ల రూపాయల ఆదాయం నష్టపోతుంది. ఒకరి బిల్లుపై మరొకరు, ఒకసారి వాడిన బిల్లునే మరోసారి వాడడం.. మార్కెట్ కమిటీ (మిగతా 6వ పేజీలో)

అడ్డంగా దొరికిన మరో వ్యాపారి

తాజాగా ఒక వ్యాపారికి చెందిన బిల్లు పుస్తకాలను నకిలీవి ముద్రించి వ్యాపారం చేస్తూ మరో వ్యాపారి అడ్డంగా దొరికాడు. మార్కెట్‌లో ఒకరి బిల్లుపై మరొకరు వ్యాపారం చేసినట్లు రుజువు కావడంతో మార్కెట్ అధికారులు అసలు అలా ఎలా జరిగిందనే కోణంలో విచారణ చేపట్టారు. మార్కెట్‌లో తాజాగా దొంగ బిల్లుపై దొరికిన పత్తి వ్యాపారి, ఇదే మార్కెట్‌లో పత్తి వ్యాపారం చేసే నవీద్ ట్రేడర్స్‌కు చెందిన ఎక్స్‌పోర్ట్ పర్మిట్ బుక్(మార్కెట్ అధికారులు ఇచ్చే సెస్ బుక్)ను దొంగచాటుగా నకిలీది ముద్రించాడని రుజువైంది. సదరు ఈ రెండు సంస్థలు ఒకే ఆడిట్ కంపెనీ వద్ద ఆడిటింగ్ చేయిస్తుంటాయి. ఆ సంస్థ వద్దకు పనిమీద వెళ్లిన ఎంకే ట్రేడింగ్ కంపెనీ వ్యాపారి దొంగచాటుగా అక్కడ ఉన్న నవీద్ ట్రేడింగ్ బిల్లు బుక్‌ను గమనించి ఎవరికీ కనిపించకుండా దొంగచాటుగా ఆ బుక్‌లోని కొన్ని రశీదులను తొలగించి సేమ్ టూ సేమ్ అలాంటి బుక్‌నే అందులోని రశీదు నెంబర్లతో సహా నకిలీదిగా ముద్రించాడని పలువురు ఆరోపిస్తున్నారు.

నిర్మాణం సరే.. ప్రారంభం ఎప్పుడు !?

- భవన నిర్మాణం పూర్తయినా.. ప్రారంభం కాని ఆస్పత్రి
- వర్షాలకు కురుస్తున్న పాత భవనం
- కొత్త భవనం ప్రారంభించాలని కోరుతున్న స్థానికులు



నిర్మాణం పూర్తి అయిన ఆస్పత్రి భవనం

సత్తుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ కేంద్రమైన సత్తుపల్లిలో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయినా.. ఇంకా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ భవనాన్ని ఎప్పుడో ప్రారంభించాల్సి ఉన్నా.. గత ఆరు నెలలుగా ముహూర్తం కుదరడం లేదు. సత్తుపల్లిలో ప్రస్తుతం ఉన్న ఏరియా ఆస్పత్రి ఐదు దశాబ్దాల క్రితం నిర్మించింది కావడంతో.. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని కొత్త భవనాన్ని మంజూరు చేసి నిర్మించగా.. ఇంకా ప్రారంభానికి నోచుకోక పోవడం గమనార్హం.

రూ.35 కోట్లతో నిర్మాణం

సత్తుపల్లిలో వైద్య సౌకర్యాలు మెరుగు పరచాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న ఏరియా ఆస్పత్రిలో 50 పడకల సామర్థ్యాన్ని 100 పడకలకు పెంచి మూడేళ్ల క్రితం కొత్త ఆస్పత్రి భవనాన్ని మంజూరు చేశారు. అన్నీ అనుకున్నట్టుగా కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యింది. ఆస్పత్రిలో అవసరమైన అన్ని వసతులకు సంబంధించి పరికరాలూ చేరాయి. అధునాతనమైన వైద్య పరికరాలు కొత్త భవనంలో ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాయి. కొత్త భవనంలో ఐదు ఆపరేషన్ థియేటర్ల ఏర్పాటుకు నిర్ణయించి.. ఆ దిశగా నిర్మాణం కూడా చేశారు. ఇప్పటికే ఒక ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన మెటీరియల్ ఇక్కడికి చేరింది. మిగిలిన థియేటర్లకు సంబంధించిన పరికరాలు చేరాల్సి ఉంది. డిజిటల్ ఎక్స్‌రే, ల్యాబ్ ఏర్పాటుకు అవసరమైన సామగ్రి కూడా వచ్చింది. కానీ కొత్త భవనం ప్రారంభమైతే గానీ ఇవన్నీ అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు.

59 వైద్యుల పోస్టులు

కొత్తగా నిర్మించిన 100 పడకల ఏరియా ఆస్పత్రి ప్రారంభమైతే ఇక్కడ 59మంది వైద్యుల అవసరం ఉంటుంది. 59వైద్య పోస్టులలో పలు విభాగాలకు చెందిన నిపుణులు అందుబాటులో ఉంటారు. దీని వల్ల స్థానికంగా మెరుగైన వైద్య సేవలు స్థానికులకు అందుబాటులోకి వస్తాయి.

పాత భవనంలో అన్నీ సమస్యలే..

ప్రస్తుతం పాత ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో.. శ్లాబు నుంచి వర్షపు నీరు కారుతోంది. దీంతో రోగులు, ఆస్పత్రి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగులకు బెడ్స్ కూడా సక్రమంగా లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. వైద్యుల పోస్టులు కూడా పెద్ద సంఖ్యలో ఖాళీలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఆస్పత్రిని సకాలంలో ప్రారంభిస్తే అన్ని సమస్యలు తొలగిపోతాయని, ఆ దిశగా పాలకులు కొత్త భవనాన్ని వెంటనే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



కల్యాణ కట్ట కింది భాగంలో పేరుకుపోయిన ఒండ్రుమట్టి

గోదావరి మరింత తగ్గుముఖం

భద్రాచలం వద్ద 36.2 అడుగుల నీటిమట్టం

భద్రాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మరింత తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం రెండు ప్రమాద హెచ్చరికలు ఉపసంహరించడంతో.. నదీ పరివాహక ప్రాంతవాసులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12గంటలకు 41.8 అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం శనివారం ఉదయం 6 గంటలకు 39.7 అడుగులకు, ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు 37.8 అడుగులకు తగ్గింది. సాయంత్రం 6 గంటలకు 36.2 అడుగులకు గోదావరి నీటిమట్టం తగ్గింది. ఇదిలా ఉండగా.. గోదావరి స్నానఘట్టాలు గత మూడు రోజులుగా నీట మునిగి ఉండగా.. క్రమేపి నీటి మట్టం తగ్గడంతో వాటిపై ఒండ్రుమట్టితో కూడిన బురద పేరుకుపోయింది. దేవస్థానం కల్యాణ కట్ట కింది భాగం, స్నానఘట్టాలపై ఒండ్రుమట్టిని తొలగించాల్సి ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించిన చర్యలను సత్వరమే చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

యూరియా కోసం ఆందోళన

కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో రైతుల బైఠాయింపు

కారేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియాను వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లాలోని కారేపల్లిలో రైతులు శనివారం ఆందోళనకు దిగారు. తెల్లవారుజామునే యూరియా కోసం రైతులు మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఎదుట బారులు తీరారు. అయితే అక్కడ దొరక్కపోవడంతో ఆగ్రహానికి గురైన అన్నదాతలు.. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గల రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. సుమారు అరగంట పాటు అక్కడే బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు అవసరమైన యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో ఇల్లెందు, ఖమ్మం ప్రధాన రహదారిలో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. రైతుల ఆందోళన సమాచారం తెలుసుకున్న వ్యవసాయ శాఖ మండల అధికారి బట్టు అశోక్ కుమార్, ఎస్సై బిగోపి వెంటనే ఘటనా స్థలికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. అయినప్పటికీ అన్నదాతలు అధికారుల మాట వినకుండా యూరియా ఇవ్వాల్సిందేనని పట్టుబడుతూ ఆందోళన కొనసాగించారు. చివరకు ఏవో అశోక్ కుమార్ జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని వివరించారు. ఆ తర్వాత త్వరలోనే యూరియా కారేపల్లికి వస్తున్నట్టు ఏవో స్పష్టంగా చెప్పడంతో.. రైతులు ఎట్టకేలకు శాంతించారు.

ఆవు పేడతో వినాయక విగ్రహాలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నేపథ్యంలో ఆవు పేడతో తయారు చేసిన వినాయక విగ్రహాలను ఖమ్మం జిల్లాలో మొట్ట మొదటిసారిగా నగరంలోని టేకులపల్లి గోశాల నిర్వాహకులు ఆరుట్ల శ్రీనివాసాచార్యులు, శ్రీరామ్‌చార్యులు తయారు చేస్తున్నారు. ఈ ఏడాది 108 విగ్రహాలను తయారు చేశారు. వీటిలో విజయ వాడకు చెందిన కొందరు 35 విగ్రహాలను కొనుగోలు


విగ్రహాల తయారీని వివరిస్తున్న యువతి


ఆవుపేడతో చేసిన వినాయక విగ్రహాలు

చేయగా, మిగిలిన విగ్రహాలను ఖమ్మం నగరానికి చెందిన వారు కొనుగోలు చేశారని తెలిపారు. ఒక్కో విగ్రహం తయారీకి రూ.60ల వరకు ఖర్చు పెట్టామని, రూ. 100 లకు ఒక్కో విగ్రహాన్ని అమ్ముతున్నట్టు తెలిపారు. పచ్చి పేడ, రంపపు పొట్టు, ముల్తాన్ మట్టి (గమ్ము) కలిపి తయారు చేసి ఎండలో సుమారు 4నుంచి 5 రోజులు ఎండిన అనంతరం సహజ సిద్ధమైన రంగులతో విగ్రహాలకు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విగ్రహాల తయారీ కొరకు బెంగుళూరు, నాగపూర్, తదితర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకున్నట్లు శ్రీరామ్‌చార్యులు తెలిపారు. విగ్రహాలకు డిమాండ్ పెరిగిందని, ఆవుపేడతో పర్యావరణ అనుకూల వినాయక విగ్రహాలు తయారు చేశామని తెలిపారు. హిందూ సంస్కృతిలో ఆవుపేడను పవిత్రంగా భావిస్తుంటారు. అందుకే ఎండిన ఆవుపేడతో కలప దుమ్ము, కలిపి మిశ్రమాన్ని వినాయకుడి అచ్చులో పోసి విగ్రహాన్ని తయారు చేశామని 15 నిమిషాల్లోనే తయారు చేసినా.. ఈ విగ్రహాలు ఆర బెట్టడానికి నాలుగైదు రోజులు పడుతోంది.. చవకగా లభిస్తున్న ఆవుపేడ వినాయక విగ్రహాలకు ప్రజలనుంచి మంచి డిమాండ్ ఏర్పడింది.పలు ప్రాంతాల నుంచి తమకు విగ్రహాల కోసం ఆర్డర్లు వచ్చాయని చెప్పారు. ప్రజలందరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని, ఆవు పేడతో తయారు చేసిన ఈ వినాయక విగ్రహాలను కొనుగోలు చేయటం ద్వారా సంప్రదాయాన్ని పాటించాలని, విగ్రహాల నిమజ్జనం చేసిన అనంతరం వాటిని ఎరువుగా ఉపయోగించవచ్చని తయారీదారుడు తెలిపారు. రానున్న రోజుల్లో ఆవు పేడతో మరిన్ని వస్తువులు తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది రక్షా బంధన్ సందర్భంగా ఆవుపేడతో పర్యావరణహిత రాఖీల తయారీకి శ్రీకారం చుట్టామని ఆవుపేడతో వివిధ రకాల రాఖీలను తయారు చేశామని తెలిపారు.


వినాయక విగ్రహాలకు రంగులద్దుతున్న దృశ్యం

భాద్రపద మాసంలో రామాలయంలో జరిపే ఉత్సవాలివే..

» 7న చంద్రగ్రహణం.. ఆలయం మూసివేత » 15న శ్రీవైష్ణవ కృష్ణాష్టమి

భద్రాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో భాద్రపద మాసంలో జరిపే ఉత్సవాల వివరాలను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి విడుదల చేశారు. 27న రామాలయంలో వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే 28న చిత్తానక్షత్రం సందర్భంగా సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

7న చంద్రగ్రహణం..

సెప్టెంబరు 7న మధ్యాహ్నం ఒంటిగంటకు రామాలయం మూసివేయనున్నారు. తిరిగి 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు తెరిచి సుప్రభాతం, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ఆరాధన, సేవాకాలం, నివేదన నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 7.30 గంటలకు స్వామి వారి దర్శనం ప్రారంభం కానుంది. అలాగే 12న సంధ్యాహారతి జరగనుంది. అదేవిధంగా 15న శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రామాలయంలో శ్రీ కృష్ణ అవతారోత్సవం, ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. 16న ఉట్ల పండుగ, 17న స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు.

ఆగస్టు 26 లోపు టీఎంఆర్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

మైనారిటీ ప్రాంతీయ సమన్వయ అధికారి అరుణ కుమారి

ఖమ్మంఖానాపురంహవేలి/కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని టీఎంఆర్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆగస్టు 26లోపు మైనారిటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ ప్రాంతీయ సమన్వయ అధికారి ఎం.జె.అరుణ కుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత ఆసక్తి గల మైనారిటీ (ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, జైనులు, సిక్కుల) విద్యార్థుల నుంచి ఉమ్మడి జిల్లాలోని టీఎంఆర్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఎంపీసీ/బైపీసీ గ్రూపుల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు టీఎంఆర్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి అర్హులని, ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను ఆగస్టు 26 లోపు సమర్పించాలని, ప్రవేశ పరీక్ష ఆగస్టు 29న ఉంటుందన్నారు. వివరాల కోసం విద్యార్థులు 9154365017, 7893116918 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

జాతీయ క్రీడా ఉత్సవాలు షురూ

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని పలు మైదానాల్లో పలు క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంతోపాటు, కల్లూరు, మధిర, వైరా స్టేడియాల్లో పదేళ్ల లోపు పిల్లలకు స్కేటింగ్, టేబుల్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్ షటిల్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్టేడియంలో పోటీలను డీవైఎస్‌వో సునీల్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. నేషనల్ స్పోర్ట్స్ డే వేడుకలు జిల్లా వ్యాప్తంగా 9 రోజుల పాటు నిరంతరంగా కొనసాగుతాయని అన్నారు.


పరుగు పోటీలో క్రీడాకారులు

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి..

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, అగ్నిమాపక, విద్యుత్, మునిసిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివిధశాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలన్నారు. జిల్లాలోని అన్ని మునిసిపాలిటీలు, మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీసు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు.పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలన్నారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీపీవో చంద్రమౌళి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్‌కొత్తగూడెం ఆర్డీవో మధు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల వినియోగంపై ప్రచారమేదీ?

» పర్యావరణ హితం...మాటలకే పరిమితం

» పీవోపీ విగ్రహాలతో కలుషితమవుతున్న గోదావరి

» అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలం


గతేడాది నిమజ్జనానికి వచ్చిన పీవోపీ విగ్రహాలు

భద్రాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విఘ్న నాయకుడు గణనాథున్ని భక్తితో పూజించేందుకు మట్టి ప్రతిమలు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని తెలిసినా.. ఎంతో ప్రాధాన్యమైన ఈ అంశం మాటలకే పరిమితం అవుతోంది. ఏటా భక్తులచే పూజలందుకున్న గణనాథున్ని నిమజ్జనం చేసేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు సరిహద్దున ఉన్న ఏపీ నుంచి సైతం భారీగా గణేష్ విగ్రహాలు గోదావరిలోనే నిమజ్జనం చేస్తున్న పరిస్థితులున్నాయి. దీంతో పూర్తిగా రసాయనాలతో గోదావరి కలుషితమవుతోందని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ఇంతటి ప్రాధాన్యత అంశాన్ని గణేష్ ఉత్సవ కమిటీలు పట్టించుకోకపోవడం వారికి అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలం అవుతుండటంతో ప్రతీ సారి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన గణేష్ విగ్రహాలనే పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు. ఈసారి సైతం 27న వినాయక చవితిని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా అత్యధిక శాతం పీవోపీతో తయారు చేసిన విగ్రహాలే ఏర్పాటు చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కనీసం నెల రోజుల ముందునుంచైనా సోషల్ మీడియాతో పాటు ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా భక్తులకు అవగాహన కల్పించాల్సిన కాలుష్య నివారణ మండలి ఉదాసీనంగా వ్యవహరించడం పట్ల సర్వత్రా ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి.

కలుషితమవుతున్న గోదారమ్మ

గోదారమ్మకు ఎంత కష్టం.! ఎందుకంటే? 11 రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న గణనాథున్ని నదిలో నిమజ్జనం చేసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది విగ్రహాలను భద్రాచలం పుణ్యక్షేత్రానికి తెస్తున్నారు. చివరి రెండు రోజులు 48గంటలకు పైనే సమయం పడుతోంది. ఏటా రెండువేలకు పైగా విగ్రహాలు గోదావరిలో నిమజ్జనం చేస్తుండగా.. అందులో 95 శాతం పీవోపీతో చేసినవే కావడం శోచనీయం. కనీసం వచ్చే ఏడాదికి మట్టి విగ్రహాలనే తీసుకురండి లేదా అనుమతించం అని గట్టిగా గణేష్ నిర్వాహక కమిటీలకు చెప్పే ప్రయత్నం కూడా అధికార యంత్రాంగం చేపట్టకపోవడం ఆవేదనకు గురి చేస్తోందని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు.

డెంగీ ఎలీసా వాషర్, రీడర్ మిషన్ల సరఫరాకు టెండర్లు

డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ ఎలీసా వాషర్, రీడర్ మిషన్ల సరఫరా చేసేందుకు టెండర్లు దాఖలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీల్డ్ కవర్ టెండర్లను ఆఫ్‌లైన్ పద్ధతిన ఆగస్టు 27 మధ్యాహ్నం 3 గంటల్లోగా సమీకృత ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని, 27 లోగా దాఖలైన టెండర్లను ఆగస్టు 28న ఎంపిక చేయనున్నట్టు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మార్కెట్‌లో మాయగాళ్లు

(5వ పేజీ తరువాయి)

అధికారికంగా ఇచ్చే సెస్ పుస్తకాలను సొంతంగా ముద్రించుకోవడం.. తదితర రకాలుగా మోసం చేస్తూ అడ్డంగా బుక్కవుతున్నారు. ఇలా దొరికిన వ్యాపారుల వద్ద నుంచి వారు ఎగ్గొట్టిన సెస్‌ను తిరిగి రాబట్టుకోవడంలో మార్కెట్ అధికారులు విఫలమవుతున్నారు. ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారం చేస్తూ మార్కెట్‌కు చెల్లించాల్సిన ఫీజు ఎగ్గొట్టిన వారు ఇప్పటి వరకు సుమారు 8 మంది వరకు వ్యాపారులు ఉన్నారు. వారు సుమారు కోటిన్నర రూపాయలకు పైగా మొండి బకాయిదారులుగా ఉన్నట్టు మార్కెట్ అధికారులు నిర్ధారించారు.

ఎంకే ట్రేడర్స్ ఫరంపై కేసు నమోదు

నకిలీ బిల్లులపై పత్తిని ఎమ్మిగనూరు మార్కెట్ పరిధి సంస్థకి విక్రయించిన ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు చెందిన ఎంకే ట్రేడర్స్ వ్యాపారిపై శుక్రవారం మార్కెట్ అధికారులు త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసి విచారణ చేపట్టారు. సదరు నకిలీ బిల్లులపై వ్యాపారం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంకే ట్రేడర్స్ వ్యాపార లావాదేవీలపై సైతం మార్కెట్ అధికారులు విచారణ చేస్తున్నారు. గతంలో సైతం రెండు మూడు ట్రేడింగ్ లైసెన్సులతో మార్కెట్‌లో పత్తి వ్యాపారం చేసి మార్కెట్ ఫీజు ఎగ్గొట్టినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విచారణ చేస్తున్నట్లు మార్కెట్ అధికారులు తెలపారు.

ఏ వ్యాపారైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రవీణ్ కుమార్‌రెడ్డి (మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి)

మార్కెట్‌లో వ్యాపారం చేసే ఏ వ్యాపారైనా మార్కెట్ నియమ నిబంధనల ప్రకారం నడుచుకోవాలి. నియమ నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. అందులో ఎలాంటి సందేహం లేదు. రైతులకు, మార్కెట్ వ్యవస్థకు నష్టం చేకూర్చేలా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవు.

విద్యుదాఘాతంతో మధ్యాహ్న భోజన వర్కర్ మృతి

మణుగూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మధ్యాహ్న భోజన వర్కర్ మృతి చెందిన సంఘటన మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని రాజుపేటలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజుపేటలో గల సర్వశిక్ష అభియాన్ స్కూల్ మధ్యాహ్న భోజన వర్కర్ భూక్యా గౌరి (56) శనివారం విధులు నిర్వహిస్తుండగా విద్యుత్ షాకు గురైంది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా, ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సమాచారం సేకరించారు.

నిధులు మంజూరైనా.. ప్రారంభానికి నోచుకోని పనులు

రూ. 9.90కోట్ల నిధులు మంజూరైనా రహదారుల నిర్మాణానికి కలగని మోక్షం

టెండర్లు వేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు

ప్రజలకు తప్పని ఇబ్బందులు

జూలూరుపాడు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంగట్లో అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లుగా రహదారుల నిర్మాణాల కోసం కోట్లాది రూపాయాల నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్న పనులు ప్రారంభానికి నోచుకోకపోవటం విడ్డూరం. దీంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది రహదారుల పరిస్థితి. దీంతో రహదారుల సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ప్రయాణాలు సాగించటం దుర్లబంగా మారింది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉండాలని, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రయాణం సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతో రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరి చేసింది. కాగా పనులు మాత్రం నేటికి ప్రారంభానికి నోచుకోలేదు. నిధులు మంజూరై రెండేళ్లు అయినప్పటికి నిర్మాణాలలో జాప్యం కావటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. నిర్మాణాలు పూర్తయ్యి ఎప్పుడు తమ ప్రయాణాలు ఇబ్బందులు లేకుండా సాగుతాయోనని ఎదురు చూస్తున్నారు.


ఇంకా ప్రారంభం కాని తవిసిగుట్టతండా - మాచినేనిపేటతండా రహదారి నిర్మాణ పనులు

రూ. 9.90కోట్ల నిర్మాణాలకు కలగని మోక్షం

జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల మధ్య బిటి రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 9.90కోట్ల నిధులను 2003వ సంవత్సరంలో మంజూరి చేసింది. కొత్తూరు నుంచి వినోభనగర్ వరకు 5కిలోమీటర్ల మేర బిటి రహదారి నిర్మాణానికి రూ. 4.50కోట్ల సీఆర్‌ఆర్ నిధులను, మాచినేనిపేటతండా నుంచి మాచినేనిపేట వరకు 1.5కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి కోటి రూపాయాల నిధులను కేటాయించింది. అదే విధంగా ఎస్టీఎస్‌డీఎఫ్ కింద తవిసిగుట్ట తండా నుంచి మాచినేనిపేటతండా (హరిజనవాడ) వరకు కిలోమీటర్ రహదారి నిర్మాణానికి ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు కోటి రూపాయా లను, వెనకతండా నుంచి రాజారావుపేట వరకు రహదారి నిర్మాణానికి మరో కోటిరూపాయాల ఎస్‌డీఎఫ్ నిధులను మంజూరీ చేసింది. అదే విధంగా చీపురుగూడెం నుంచి చింతలతండా మీదగా సింగభూపాలెం వరకు బిటి రహదారి మరమ్మతులకు రూ. 2.40కోట్ల ఎంఆర్‌ఆర్ నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఇదిలా వుండగా గత ఏడాది డిశంబర్ నెలలో తవిసిగుట్టతండా - మాచినేనిపేటతండా బిటి రహదారి నిర్మాణానికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. 8 నెలలు గడిచిన నేటికి రహదారి నిర్మాణపనులు ప్రారంభానికి నోచుకోకపోవటం గమనర్హం.


ప్రారంభానికి నోచుకోని కొత్తూరు - వినోభానగర్ గ్రామాల మధ్య బీటీ రహదారి నిర్మాణ పనులు

టెండర్లు వేయటానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు

రహదారుల నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. దీంతో ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. టెండర్లు వేయటానికి కాంట్రాక్టర్లు ఆసక్తిని కనబరచటంలేదని అధికారులు చెబుతున్నారు. నిధులు ఉన్నప్పటికి నిర్మాణ పనులు ప్రారంభంకాకపోటానికి టెండర్ల ప్రక్రియే కారణమని అధికారులు అంటున్నారు. బిల్లుల చెల్లింపుల విషయంలో జాప్యం జరుగుతుందనే సంశయమే కాంట్రాక్టర్లు టెండర్లు వేయకపోటానికి ముందుకు రావటంలేదని తెలుస్తుంది. టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తిచేసి రహదారి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించి త్వరితగతిన పనులను చేపట్టి తమ ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి శంకుస్థాపన చేసిన పనులకూ మోక్షం లేదు

బొడా అనిల్, తవిసిగుట్టతండా



తవిసిగుట్టతండా - మాచినేనిపేటతండాల మధ్య బీటీ రహదారి నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివా సరెడ్డి శంకుస్థాపన చేసి 8 నెలలు గడిచిన పనులను ప్రారంభించకుపోవటం విడ్డూరంగా ఉంది. రహదారి సౌకర్యం సరిగ్గా లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులను ప్రారంభిస్తాం

నాగేందర్, పంచాయతీరాజ్ డీఈ



రహదారి నిర్మాణానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులను ప్రారంభిస్తాం. ఇప్పటికే టెండర్లు పిలిచినప్పటికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోటంతో జాప్యం జరుగుతుంది. త్వరితగతిన రహదారులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

13న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్

(5వ పేజీ తరువాయి)

ఉండదన్నారు. కోర్టు ఫీజులు సైతం తిరిగి వెనక్కు ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇరు పార్టీలు రాజీ మార్గం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీ పడితే.. మానసిక ప్రశాంతత సైతం లభిస్తుందని అన్నారు. లోక్ అదాలత్ విజయవంతానికి అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో లోక్ అదాలత్‌తో పాటు పోక్సో కేసులు, మీడియేషన్‌కు సంబంధించిన కేసులను పోలీసులు, ఇతర అధికారులతో కలిసి సమీక్షించారు. ముఖ్యంగా ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల గురించి ఆయా కాలేజీలు, హాస్టల్ యందు సైన్‌బోర్డ్స్ ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయాధికారి ఉమాదేవి సూచించారు. బాలల సంరక్షణ కేంద్రాల్లో బాలల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. చిన్న పిల్లల రక్షణ, అనాథ పిల్లల పట్ల ప్రేమపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు కేవీ చంద్రశేఖర్‌రావు, వెంపటి అపర్ణ, యం.అర్చనకుమారి, దేవినేని రాంప్రసాదరావు, కాసరగడ్డ దీప, వినుకొండ మాధవి, డిఫెన్స్ కౌన్సిల్స్ బిల్ల శ్రీనివాస్, ఖండే వెంకటేశ్వరరావు, బార్ కార్యదర్శి దిలీప్‌కుమార్, గురజాల సీతారామారావు, విష్ణువందన, పోలీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భద్రాద్రి రైతులకు సీతారామ జలాలు అందించాలి

ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు

కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ విధానాలను నిరసిస్తూ బీజేపీ ఆందోళన


జూలూరుపాడులో ధర్నాలో పాల్గొన్న ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, నాయకులు

జూలూరుపాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీతారామ జలాలను భద్రాద్రి జిల్లా రైతులకు అందించకుండా ఇతర ప్రాంతాలకు నీటిని తీసుకువెళ్లి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం భద్రాద్రి జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఖమ్మం జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. సీతారామ జలాలను భద్రాద్రి జిల్లా రైతులకు అందించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ శనివారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడులో ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణానికి భద్రాద్రి జిల్లా రైతులు భూములను ఇచ్చినప్పటికి ఈ ప్రాంత రైతులకు సాగునీటిని ఇవ్వకపోవటం తగదన్నారు. ఈ ప్రాంత రైతులకు నీళ్ల ఇచ్చిన తర్వాతే ఇతర ప్రాంతానికి తీసుకెళ్లాలని, తక్షణమే డిస్ట్రిబ్యూటరి కాలువలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లను మంజూరీ చేయకుండా అన్యాయం చేసిందని ఇళ్ల మంజూరీలో కాంగ్రెస్ కార్యకర్తలకే ప్రాధాన్యతను ఇచ్చిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాష్టానికి వాటాకు మించి యూరియాను సరఫరా చేసిందన్నారు. యూరియాను సరఫరా చేయటం రాష్ట్ర ప్రభుత్వానికి చేతకాకపోటం తోనే రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, దళారులే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మండలంపై దృష్టి పెట్టకపోవటంతోనే ప్రజలు సమస్యల పరిష్కారానికి నోచుకోవటంలేదన్నారు. అంతకుముందు బేతాళపాడు, పడమటనర్సాపురం గ్రామాలలో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా రమేష్, నాయకులు నున్నా రమేష్, దుద్దుకూరి కార్తీక్, మిశ్రా, సిరిపురపు ప్రసాద్, నరసింహారావు, అన్నవరపు సత్యానారయణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్పోర్ట్స్ డే సందర్భంగా కొత్తగూడెంలో 2కే రన్

డీవైఎస్‌వో పరంధామరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి) : జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకొని కొత్తగూడెంలో 2కే రన్ ఆదివారం ఉదయం 6 గంటలకు నిర్వహిస్తున్నామని జిల్లా యువజన క్రీడల అధికారి పరందామరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్‌డే వేడుకల్లో భాగంగా ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పోస్టుఆఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు ఈ 2కే రన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు, కళాశాల, పాఠశాల విద్యార్థులు, బాధ్యులు ఈ రన్‌లో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

భద్రాద్రి టూరిజం ప్రాంతాల్లో అడ్వెంచర్ ప్రతినిధుల పర్యటన డీవైఎస్‌వో

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతం టూరిజం ప్రాంతాలలో అడ్వెంచర్ ఆక్టివిటీలో జిప్ లైన్, రోలర్ కోస్టర్స్, స్కై సైకిల్స్ తదితర అభివృద్ధి చేయటం కోసం నైల్ ఇండియా అడ్వెంచర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు జిల్లాలో మణుగూరు - రథంగుట్ట, ఇల్లందు - ఊరగుట్ట, పాల్వంచ - కిన్నెరసాని ప్రాంతాలలో పర్యటించారు. ఈ అటవీ ఏరియాలో ఉన్నటువంటి ప్రాంతాలలో యూత్ కోసం, ప్రజల కోసం ఎటువంటి అడ్వెంచర్ ఆక్టివిటీలు అవసరం ఉన్నాయో గుర్తించి జిల్లా కలెక్టర్‌తో చర్చింస్తామని డీవైఎస్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక, పాల్వంచ, ఇల్లందు ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

● గెలిచి నిలిచారు..

ఉన్నత విద్య.. ఆదర్శవంతమైన జీవనం

- మహిళా శక్తి క్యాంటీన్‌తో స్వయంఉపాధి
- ఉన్నత విద్య పూర్తి చేసిన దంపతులు
- ప్రేమకోసం పోరాడి పెళ్లితో ఒక్కటై..
- స్వయంశక్తితో ఎదిగిన ఆదర్శ దంపతులు

డిగ్రీలు, పూర్తిచేసి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలనే లక్ష్యంతో ఆ యువతీ, యువకులు ముందుకెళ్లాల నుకున్నారు. కానీ ఆ సమయంలోనే.. వారి మధ్య ఏర్పడిన మధురమైన ప్రేమ కూడా వారి ఆలోచనలను ఒక్కటి చేస్తూ.. జీవనపోరాటానికి సహకారం అందించింది. వీరి ప్రేమతో పాటు సర్కారీ ఉద్యోగమే లక్ష్యంగా ప్రయాత్నిస్తూ పోటీ పరీక్షలను రాస్తూనే నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. జీవితంలో ఒక్కటైన అనంతరం గెలుపు పోరాటం చేద్దాం అనుకుంటే.. యువతి కుటుంబ పెద్దల నుంచి ఆ యువకుడికి ప్రభుత్వ ఉద్యోగం లేదంటూ నిరాకరణ ఎదురయ్యింది. అయినా పట్టుదలతో పోరాడి పెద్దలను ఒప్పించి వారి ప్రేమను జయించారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం విసుగు చెందకుండా చేసిన పోరాటంలో అలిసిపోయిన వారికి చేయూతనిస్తూ పూర్వ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య అండగా నిలిచారు.



సండే స్పెషల్ SUNDAY SPECIAL

ఖమ్మం సంక్షేమవిభాగం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన నిమ్మటూరి ధనలక్ష్మి తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది. అదే కాలనీకి చెందిన దుంపటి గోపి కుటుంబం కూడా నివసిస్తుంది. వీరు ఇరుగుపొరుగు కుటుంబాలుగా ఉండేవారు. ధనలక్ష్మి పీజీ పూర్తి చేసి పోటీ పరీక్షలు రాస్తూ ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూస్తుంది. డిగ్రీ పూర్తి చేసిన గోపి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. ఇరుగుపొరుగున ఉండడంతో వారి మధ్య ప్రేమ ఏర్పడింది. అయితే ఈ విషయం ధనలక్ష్మి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు ఆ యువకుడికి ప్రభుత్వ ఉద్యోగం లేదని పెళ్లికి నిరాకరించారు. కానీ ఆ యువకుడు ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి ధనలక్ష్మిని పెళ్లి చేసున్నాడు. అనంతరం ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో వారు పూర్వ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్యను సంప్రదించారు. ఆయన వారికి ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే తొలి మహిళా శక్తి క్యాంటీన్ పొందే అవకాశం వారికి కల్పించారు. దీంతో ఆ కుటుంబం మహిళ శక్తి క్యాంటీన్‌తో ఉన్నతమైన జీవనం గడుపుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటీన్లను తొలిసారి గా పూర్వ కలెక్టర్ ముజమ్మిల్ ఆదేశాలతో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య ఖమ్మం నగర పాలక సంస్థలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. ఆ యువ దంపతులైన ధనలక్ష్మి, గోపిలను ప్రోత్సహించాలనే ప్రయత్నంలో మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవో చిలకా ద్రౌపది వారిని గుర్తించారు. మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు ఆ దంపతుల వివరాలను కమిషనర్ అభిషేక్ అగస్త్యకు అందించారు. డిగ్రీ, పీజీ పూర్తిచేసి నిరుద్యోగుల ఉన్న వారికి ముందు గా స్వయంఉపాధి కల్పించాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం లో తొలి మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటుకు ఓకే చెప్పారు. దీంతో మెప్మా టీఎంసీ, సీవోలు యూనియన్ బ్యాం కు నుంచి మహిళా శక్తి పథకంలో భాగంగా రూ.5 లక్షల రుణాన్ని ఇప్పించారు. దీంతో 2024 ఆగస్టు 27న ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు.

దిగ్విజయంగా ఏడాది పూర్తి..

మహిళ శక్తి క్యాంటీన్ నిర్వాహణలో ధనలక్ష్మి, గోపి దంపతులు ఆదర్శంగా నిలిశారు. కేఎంసీ కార్యాలయంతో పాటుగా ఖమ్మం, వైరా, కూసుమంచి, సమీప ప్రాంతాలకు ఆహారపు వంటలు తయారు చేసి సరఫరా చేస్తున్నారు. తక్కువ ధరలకే ఇంటి వంటను గుర్తుచేసేలా చికెన్ బిర్యాని, జీరా రైస్, వెజ్ బిర్యానీ, అల్పాహారంతో పాటుగా స్నాక్స్, టీ మహిళా శక్తి క్యాంటీన్లలో అమ్మకాలు చేస్తున్నారు. ఆ దంపతులకు సహాయంగా గోపి తల్లి కూడా క్యాంటీన్‌లో స్వయంగా పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ప్రతి రోజూ టీ, స్నాక్స్ ద్వారా రూ.5వేల నుంచి రూ.7వేల వరకు అమ్మకాలు జరుపుతున్నారు. అలాగే ఆహారపు పదార్థాల ఆర్డర్ల మీద రోజుకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు సంపాదిస్తున్నట్లు తెలిపారు.



ఖమ్మం మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మెప్మా టీఎంసీ సుజాతరాణి తదితరులు

మహిళా శక్తి మాకు అండైంది..

- దుంపటి ధనలక్ష్మి, క్యాంటీన్ యజమాని



మేము ప్రేమించి పెళ్లి చేసుకున్నాం. మాకు ఒక బాబు, ఒక పాప జన్మించారు. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎన్నోప్రయత్నాలు చేశాం ఫలితం దక్కలేదు. మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా అధికారులు అవకాశం కల్పించారు. ఇప్పుడు మా కుటుంబానికి ఎటువంటి ఆర్థికఇబ్బంది లేదు. మాతోపాటు మా అత్తయ్య క్యాంటీన్‌లో పనిచేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. మా పిల్లల్ని మంచి స్కూల్‌లో చదివిస్తున్నాం. మా కుటుంబానికి ఆర్థికచేయూత అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ



ఖమ్మం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్

భద్రాద్రిలో పదోన్నతి జాతర

24 మంది హెడ్‌మాస్టర్లకు ఉద్యోగోన్నతి

ఈ నెల 26న స్కూల్ అసిస్టెంట్స్‌గా బాధ్యతలు

జిల్లాలో 212 మందికి వర్తింపు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతులు కొనసాగుతున్నాయి. కోర్టుల్లో కేసులు వేయడం, ఆ తర్వాత వాటిని కోర్టులు కట్టివేయడం జరిగింది. ఎట్టకేలకు పదోన్నతులకు క్లియరెన్స్ రావడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తోన్నారు. ఈ నెల 21వ తేదీ నాటికి జిల్లాలో 24 మందికి ప్రధానోపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతులు పొందే వారి జాబితాను కూడా విద్యాశాఖ రూపొందించారు. 1:1ప్రకారం పదోన్నతులు జరుగుతున్నాయి. ఈ నెల 26 నుంచి స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి పొందిన వారికి బాధ్యతలు ఇవ్వనున్నారు. అలాగే 22 నుంచి 24వ తేదీ వరకు స్కూల్ అసిస్టెంట్స్ సీనియార్టీ ప్రకారం పోస్టులు తయారు చేయడం, అభ్యంతరాల స్వీకరణ, ఫైనల్ లిస్టును తయారు చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు 25న పదోన్నతికి ఆప్షన్లు ఇస్తారు. ఆగస్టు 26న పదోన్నతుల ఆర్డర్స్‌ను జారీ చేస్తారు.

జిల్లాలో 212 మందికి స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతులు

జిల్లాలో 257ల స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. వీటిలో భాగంగా 212 మందికి పదోన్నతుల కల్పించనున్నారు. వీరిలో ఎస్ఏ గణితం 19 ఖాళీలు, ఎస్ఏ ఫిజిక్స్ 8, బయాలజీ 13, సోషల్ 21, ఆంగ్లం 10, ఎస్ఏ తెలుగు 36 ఖాళీలు, హిందీ 26, ఫిజికల్ డైరెక్టర్లు ఆరు, ఎల్ఎఫ్ఎల్, హెచ్ఎం పోస్టులు 21, స్పెషల్ ఎడ్యుకేషన్ 16 ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాల విషయంలో గణితం 5, బయాలజి 4, ఫిజిక్స్‌లో మూడు, సోషల్‌లో మూడు, ఆంగ్లంలో 5, తెలుగు -6, హిందీ -4, ఫిజికల్ డైరెక్టర్లు 2, ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో రెండు ఖాళీలు ఉన్నాయి.

కమిటీ ఏర్పాటు..

స్కూల్ అసిస్టెంట్స్ పదోన్నతుల కోసం జిల్లాస్థాయిలో నాలుగు ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అర్హులైన ఉపాధ్యాయులను ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయులకు ఎలాంటి అనుమానాలు ఉన్న నివృత్తి చేస్తారు. ఈ నెల 26న సెకండరీ గ్రేడ్ టీచర్స్ స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి ఆర్డర్స్‌ను అందుకుని నూతన హైస్కూల్‌లో చేరాల్సి ఉంటుంది.

ఆదివాసీలకు ఉచిత విద్యను అందించాలి

కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించిన ప్రొఫెసర్లు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో ఆదివాసీలకు ఉచిత విద్య అందించాలని కోరుతూ శని వారం కరపత్రాలు, పోస్టర్లను యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఆచార్య గుంటి రవీందర్, ఆచార్య జి.దయాకర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, రమణా, లక్ష్మయ్యలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అలాగే ఐటీడీఏ డీడీ మణెమ్మను కలిసి ఆదివాసీల ఉచిత విద్యకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. విద్య మీ ఇంటి దగ్గరకే అనే నినాదంతో విశ్వవిద్యాలయం పని చేస్తుందని అధికారులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వంటింట్లో చికెన్ వండుతుండగా గ్యాస్ స్టౌవ్ నుంచి మంటలు వ్యాపించి సిలిండర్ లీకవడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం సత్తుపల్లి విద్యానగర్ రోడ్‌లోని రత్నకుమారి ఇంటి పైఅంతస్తులో ఓ కుటుంబం అద్దెకు ఉంటుంది. ఐఎస్ఐ ప్రమాణం లేని స్టౌవ్‌పై చికెన్ వండుతుండగా స్టౌవ్ కింద నుంచి మంటలు వ్యాపించిగా గ్యాస్ పైపునకు మంట అంటుకోవడంతో సిలిండర్ వేడెక్కి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురై అరవడంతో వెంటనే స్థానికుల సహాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ సమాచారం అందుకున్న సత్తుపల్లి ఫైర్‌స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో ఒకరికి స్వల్పగాయాలవ్వగా వంటగదిలోని ఫ్రిజ్, వాటర్ ప్యూరీఫైయర్, వంటసామగ్రి, ఇతర సామాన్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.3లక్షల ఆస్తినష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు. మంటలను అదుపు చేసిన వారిలో ఫైర్ ఆఫీసర్ వై.వెంకటేశ్వరరావు, ఎల్ఎఫ్ ఈ.రమేష్, డ్రైవర్ మోషేబాబు, వీరబాబు, కొలా బాబూరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

తల్లాడ, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్టీఆర్‌నగర్ సమీపంలో జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వృద్ధురాలు శనివారం మృతిచెందింది. వివరాలు ఇలా.. ఈనెల 20వ తేదీన గాంధీనగర్ తండా నుంచి తల్లాడ వైపు నడుచుకుంటూ వస్తున్న 60ఏళ్ల వృద్ధురాలిని వెనుకనుండి వచ్చిన బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం వృద్ధురాలు మృతి చెందింది. ఈమేరకు తల్లాడ ఎస్ఐ బి.వెంకటేష్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

చింతకాని, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళపై ముగ్గురు కలిసి దాడి చేసిన ఘటనపై శనివారం కేసు నమోదు అయింది. ఈ మేరకు వివరాలు ఇలా.. మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన మట్టా సంధ్య సమీప గృహానికి చెందిన బండి నాగేంద్రకు మధ్య వివాదం నెలకొంది. ఈ వివాదంలో కోపోద్రిక్తురాలైన నాగేంద్ర, ఆమె భర్త, కుమారుడు ముగ్గురూ కలసి అసభ్య పదజాలంతో దూషిస్తూ సంధ్యపై దాడి చేశారు. సంధ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

రంగులు మార్చే ఊసరవెల్లి ప్రత్యక్షం..



కొత్తగూడెం సాంస్కృతికం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : అరుదైన లక్షణాలతో రంగులు మార్చే సహజ గుణం కలిగిన ఊసరవెల్లి కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని హనుమాన్ బస్తీ పరిసరాల్లో శనివారం దర్శనమిచ్చింది. ఇది చెట్టుకొమ్మల మధ్య చిలకపచ్చ రంగులో, ఆకుల మధ్య ముదురు ఆకుపచ్చ రంగుతో నల్ల చారలు కలిగి ఉంది. అంతలోనే రంగులు మార్చడాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. స్థానికుల సమాచారంతో దానిని పట్టుకున్న ప్రాణదార ట్రస్టు నిర్వహకులు సంతోష్ ఊసరవెల్లిని అడవిలోకి తరలించనున్నట్లు తెలిపారు. పరిసరాల్లోని ఉష్ణోగ్రత, వెలుతురు తీవ్రతల్లోని హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఊసరవెల్లి చర్మం స్పందిస్తూ ఉంటుంది. వాటి చర్మంలో ఉండే జీవకణాల్లో పలు యాంత్రిక నిర్మాణాల చర్యల వల్ల రంగుల మార్పు జరుగుతుందని పర్యావరణ నిపుణులు తెలుపుతున్నారు. దీనికి మరో విశేషం ఏమిటంటే దీని నాలుక దాని సహజత్వం కంటే పొడవుగా ఉండి ఆహారాన్ని వెటాడి తింటూ జీవనం సాగిస్తుంది.

ప్లాస్టిక్ రహిత మహిళా శక్తి క్యాంటీన్

ఖమ్మం అర్బన్ పార్కులో ఏర్పాటు

మెప్మా సీవోతో సమీక్షించిన డీఎఫ్‌వో

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఖమ్మం అర్బన్ పార్కులోకి ప్లాస్టిక్ రాకుండా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం ఖమ్మం మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ సల్మాతో పాటుగా మహిళ శక్తి క్యాంటీన్ నిర్వాహకురాలు లావణ్యతో జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ సమావేశమైనారు. ఇటీవలి కాలంలో ఖమ్మం అర్బన్ పార్కు ఆధునీకరణకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వైరా ప్రధాన రహదారి నుంచి అర్బన్ పార్కు వరకు 60అడుగుల రహదారి నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. పనులు కూడా పూర్తి కావటానికి వచ్చాయి. మహిళలకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని ఇదే పార్కులో మంత్రి తుమ్మల నిర్వహించి మహిళలకు అర్బన్ పార్కు చూసేలా చేశారు. దీంతో రోజు రోజుకు అర్బన్ పార్కులో ప్రజలు, విద్యార్థులు, వాకర్స్ తాకిడి పెరిగింది. దీంతో అర్బన్ పార్కులో మహిళా శక్తి క్యాంటీన్‌ను ఏర్పాటు చేసేందుకు డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్ సింగ్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో మాట్లాడారు. ప్లాస్టిక్ రహితంగా గ్లాసులు, ప్లేట్లు నుంచి కూల్‌డ్రింక్స్ వరకు ప్లాస్టిక్ వినియోగించకుండా రాష్ట్రంలోనే మోడల్‌గా ప్లాస్టిక్ రహిత మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు కార్యచరణ చేశారు. మరో రెండు రోజుల్లో క్యాంటీన్ అందుబాటులోకి రానుందని తెలిపారు.



సీవో సల్మాతో మాట్లాడుతున్న ఖమ్మం డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్

టూరిజం హబ్‌గా అటవీ ప్రాంతాలు

భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల పరిశీలన

రథంగుట్ట, కిన్నెరసాని, ఊరగుట్టలను పరిశీలించిన అధికారులు

మణుగూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సహజ సిద్ధంగా ఆహ్లాదకరమైన మనోహర దృశ్యాలు కలిగిన ప్రాంతాలు ఇకపై కొత్తరూపును సంతరించుకోబోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తింపు ఉన్న ఈ ఏరియాల్లో పచ్చని అడవులు, ఎతైన గుట్టలు, జాలువారే జలపాతాలు పర్యాటకులను ఆకట్టుకోవడమే కాకుండా రేపటి రోజున అడ్వంజరీ స్పోర్ట్స్‌కు కూడా వేదికగా మారబోతున్నాయి. జిల్లాలో ఈ ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్న జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు టూరిజం హబ్‌గా మార్చబోతున్నారు. ఇందు కోసం శనివారం మణుగూరులో జిప్‌లైఫ్ అడ్వెంచర్ బృందం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఫారెస్టు అధికారులు, పంచాయతీ శాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిబ్బంది రథం గుట్ట పరిసరాలను సందర్శించారు.

పర్యావరణ పరిరక్షణతో పాటు మానసికోల్లాసం

సహజ సిద్ధంగా ఉన్న అడవుల పచ్చదనాన్ని, జలపాతాలను సంరక్షిస్తూనే పర్యాటకులకు మానసికోల్లాసాన్ని పెంపొందించేందుకు ఈ మేరకు టూరిజం హబ్‌లో పలు స్పోర్ట్స్‌ను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయనున్నారు. వీటిలో ప్రధానంగా పర్యాటకులకు సాహసోపేత అనుభూతిని కల్పించేందుకు జిప్‌లైన్, జిప్ బైక్, గ్లాస్ బ్రిడ్జ్, రాకెట్ ఈజెన్‌క్షన్, స్కై-సైకిల్స్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. వీటి ఏర్పాటుకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను వాడనున్నాట్లు అధికారులు తెలిపారు. ఈ అడ్వెంచరీ స్పోర్ట్స్‌లో భద్రాతా ప్రామాణాలను పాటిస్తూ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



రథంగుట్ట వ్యూ పాయింట్ నుంచి పరిశీలిస్తున్న అధికారులు

నూతన ప్రాజెక్టుతో ఉపాధి అవకాశాలు

టూరిజం హబ్ పేరిట మణుగూరులోని రథంగుట్ట, పాల్వంచలోని కిన్నె రసాని, ఇల్లెందులోని ఊరగుట్ట ప్రాంతాలను ఎంపిక చేసిన అధికారులు ఈ నూతన ప్రాజెక్టు ఏర్పాట్లుకు పరిశీలను ముమ్మరం చేశారు. వీటి ఏర్పాటులో స్థానికులకు ఉపాది అవకశాలు కూడా లభించే అవకాశం ఉన్నట్లు ఎంపిడివో శ్రీనివాసరావు, ఎఫ్‌డీవో మస్కూద్ మోహీనుద్దీన్‌లు తెలిపారు. స్థానిక హస్తకళాకారులకు, చిన్న పరిశ్రమలకు మార్కెటింగ్ అవకాశం లభించబోతుంది. ఈ ప్రాంతాలకు విచ్చేసే పర్యాటకులకు సమాచారం సెంటర్లు, లోకల్ ట్రైనీలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇలా బహుళ ప్రయోజనా లతో ఈ టూరిజం హబ్‌గా అనతికాలంలోనే కార్యచరణకు నోచుకోబోతుందని అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ప్రదేశాల సందర్శన చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

'సింగరేణి' పరిరక్షణకు ఉద్యమిస్తాం..

బీఎంఎస్ జాతీయ నాయకుడు మాధవనాయక్

రుద్రంపూర్, (సింగరేణి) ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం బీఎంఎస్ ఉద్యమాలు నిర్వహిస్తుందని బీఎంఎస్ జాతీయ నాయకులు పి.మాదవనాయక్ తెలిపారు. జూలై 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 17వరకు దశల వారీ ఆందోళన కార్యక్రమాలు సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. శనివారం కొత్తగూడెంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యానికి రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన జెన్కో, ట్రాన్స్‌కో రూ.42వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కార్మికసంఘాల విఫలమయ్యాయని ఆరోపించారు. కార్మికులకు మెరుగైన క్యాడర్‌స్కీం, సొంతింటి పథకం అమలు కోసం బీఎంఎస్ పోరాడుతుందన్నారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 12వ తేదీన సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పవన్‌కుమార్, రాంసింగ్, జీవి.కృష్ణారెడ్డి, వెంకటరెడ్డి, ఏ.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, ప్రకాష్, ఠాగూర్, పద్మజా, ఈ.నాగేశ్వరరావు, శ్రావణ్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో జ్వరాలపై హెల్త్‌క్యాంప్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : సత్తుపల్లి మైనార్టీ గురుకులంలో శనివారం గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 'మైనార్టీ గురుకులానికి జ్వరం' అని ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురించిన శీర్షికకు స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాఠశాలను సందర్శించింది. జ్వరం, తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చేరిన 8 మంది పరిస్థితి బాగానే ఉందని, మిగతా వారిని కూడా పరీక్షించినట్లు గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.అవినాష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్షలు చేయగా ఆరుగురు విద్యార్థులు దగ్గు, జలుబుతో బాధపడుతుండగా ఐదుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి గంగారం పీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. గురుకులం విద్యార్థులతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.టీ.సీతారామ్ మాట్లాడి ఆరోగ్య సూత్రాలు, సూచనల గురించి వివరించారు. వ్యక్తిగత శుభ్రత ముఖ్యమని, దగ్గు, జలుబు, ఇతర సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తెలియజేస్తే పరీక్షలు చేసి చికిత్స అందిస్తామని ప్రిన్సిపాల్ వెంకట్రామయ్యకు సూచించారు. అదేవిధంగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో వసతిగృహాల చుట్టూ ఉన్న చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించి బ్లీచింగ్ చల్లించినట్లు కమిషనర్ కే.నరసింహా తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారామ్

ఇల్లు ఇచ్చి ఆదుకోండి..

ఓ గిరిజన అనాథ దివ్యాంగుడి దీనగాథ

గుర్తింపు పత్రాలు కూడా లేని నిరక్ష్యరాస్యుడు



సాయం చేయాలంటూ వేడుకుంటున్న దివ్యాంగుడు సమ్మయ్య

మణుగూరుటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : దేవాలయమే ఇల్లు దేవుడే నాకు అమ్మ నాన్న అని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మంచికంట నగర్‌కు చెందిన ఓ దివ్యాంగ గిరిజనుడు జీవిస్తున్నాడు. వివరాల ఇలా ఉన్నాయి. 45 ఏళ్ల వయసు ఉన్న పూనం సమ్మయ్య చిన్న వయస్సులోనే తండ్రి శ్రీరాములు మృతిచెందాడు. తల్లి మల్లారమ్మ పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఏకైక సోదరి కనకమ్మ అశ్వాపురం మండలంలోని తుమ్మల చెరువు గ్రామంలో తన కుటుంబంతో జీవిస్తుంది. తల్లి మరణంతో కర్మకాండలకు ఉన్న రెండు కుంటల భూమిని అమ్మి పూర్తిచేశాడు. ఆ భూమిలో ఉన్న గుడిసెలోనే అతను జీవనం ఉండే వాడు. ఇప్పుడు దాన్నీ అమ్మడంతో నివసించడానికి ఇల్లు, స్థలం లేకుండా పోయింది. అప్పటి నుంచి ఒంటరిగా ఆ గ్రామంలో ఉన్న ఓ చర్చి భవనమే అతనికి నిలువనీడైంది. ఆ దేవుడే అమ్మ నాన్న అయ్యారు. చిన్న వయస్సులో చెట్టుపై నుంచి పడడంతో కాలు విరిగి వికలాంగుడయ్యాడు. అయినా ఇతను కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కానీ ఇప్పటి వరకు ఇతనికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటర్‌కార్డు, వికలాంగుల ధ్రువీకరణ పత్రాలు అంటూ ఏమీలేవు. పూర్తి నిరక్ష్యరాస్యుడైన సమ్మయ్యకు గుర్తింపు పత్రాలు ఎలా పొందాలో కూడా తెలియని పరిస్థితి. తనలాంటి దిక్కులేని దివ్యాగుడిని ప్రభుత్వ అధికారులు ఆదుకోవాలని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నాడు. మండల అధికారులు ఓటర్ కార్డును, ఆధార్ కార్డును, వికలాంగుల సర్టిఫికెట్లను మంజూరి చేయించాలని వేడుకుంటున్నాడు. ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్ తన దీన పరిస్థితిపై స్పందించి తగిన న్యాయం చేయాలని కోరుతున్నాడు.







విద్యార్థులతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విద్యార్థుల సమగ్ర వికాసానికి బ్యాగ్ లెస్ డే

- కలెక్టర్ అనుదీప్
- ఇకనుంచి ప్రతీనాలుగో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో కార్యక్రమం

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా ప్రతీ నాల్గో శనివారం ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాగ్ లెస్‌డే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం బ్యాగ్ లెస్‌డేలో భాగంగా కలెక్టరేట్‌ను వీవీపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సందర్శించారు. వారితో కలెక్టర్ మాట్లాడారు. కలెక్టరేట్ సందర్శించి ఏమేమి గ్రహించారో అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నేడు అన్నిప్రభుత్వ పాఠశాలల్లో బ్యాగ్ లెస్ డే అమలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇకనుంచి ప్రతీ నెలా 4వ శనివారం జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్యాగ్ లెస్ డే జరుగుతుందనిన్నారు. బ్యాగ్ లెస్ డే సందర్భంగా పిల్లలు సరదాగా, ఉల్లాసంగా గడిపేలా మంచి కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్లకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగపద్మజ, జడ్పీహెచ్ఎస్ఎస్ వీవీ పాలెం హెడ్మాస్టర్ శ్రీమన్నారాయణ,ఉపాధ్యాయులు రమాదేవి, డోరిస్, శైలజ, మాధవి, దాస్, వెంకటేశ్వర్లు నగేష్, నాగులు, పుల్లయ్య, పీఈటీ ఆదర్ష్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిర నగర్ ప్రాథమిక పాఠశాల సందర్శన

ఖమ్మంఖానాపురంహవేలి: విద్యార్థుల్లో అభిరుచి, ఆసక్తిని బట్టి ఆటలు, సంగీతం, నృత్యం, కళలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనడానికి ప్రోత్సహించడమే బ్యాగ్ లెస్ డే ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పిల్లలకు చదువుల ఒత్తిడిని తగ్గిస్తూ,ఏకాగ్రతను పెంచుతూ ఉల్లాస వాతావరణం ఉండేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. బ్యాగ్ లెస్ డే కార్యకమంలో భాగంగా నగరంలోని ఇందిరనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులు కాగితపు బొమ్మలు పూలతో కలిపి చేసిన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలకడంతో కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. పిల్లలు తయారు చేసిన గ్రిటింగ్ కార్డ్స్, పోస్టర్ డిజైనింగ్, పజిల్స్ సాల్వింగ్, పేపర్‌తో చేసిన పలు ఆకృతులను కలెక్టర్ తిలకించారు. పర్యావరణహిత మట్టి గణపతులకు ప్రాధాన్యమిద్దామని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిలుపునిచ్చారు.



మట్టితో విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిరుమలాయపాలెం: నోబ్యాగ్‌లెస్‌డే సందర్భంగా తిరుమలాయపాలెంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, మోడల్ మేకింగ్, ఫ్యాన్సీడ్రస్ కాంపిటీషన్,క్విజ్‌పోటీలు నిర్వహించారు. తిరుమలాయపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం విజయకుమారి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి జరుపుకోవాలి

- పోలీసు కమిషనర్ సునీల్‌దత్
- ఉత్సవ కమిటీలు, నిర్వాహకులతో సమీక్ష





మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్, హాజరైన గణేష్ మండపాల నిర్వాహకులు

ఖమ్మంక్రైం, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణలో జరుపుకోవాలని పోలీసుకమిషనర్ సునిల్‌దత్ సూచించారు. బుధవారం నుంచి గణేష్ నవరాత్రులు ప్రారంభం నేపథ్యంలో సూర్యతేజ ఫంక్షన్‌హాల్‌లో శాంతికమిటీ,స్తంభాద్రి గణేష్ ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. మండపాల్లో డీజే ఏర్పాటుక అనుమతిలేదన్నారు. శోభాయాత్రలో ఎలాంటి ఆటంకాలు రాకుండా బందోస్తు ఏర్పాటు చేస్తున్నామని, అన్నిశాఖలుసమన్వయంతో చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో ఏడీసీపీ ప్రసాదరావు, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాస్,ఎస్‌బీ ఏసీపీ మహేష్, విద్యుత్ శాఖ ఏడీ నాగార్జున, యాదగిరి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయవద్దు
తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మంరూరల్: గ్రామాల్లో వినాయక విగ్రహల ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ పిల్లి. రాంప్రసాద్, మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జలగం నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వినాయక విగ్రహ ఏర్పాట్లపై రెవెన్యూ, మునిసిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రాజు, ఎంపీవో శ్రీదేవి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

తిరుమలాయపాలెం: గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి కోరారు. శనివారం తిరుమలాయపాలెం పోలీసుస్టేషన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవ కమిటీ వారు పోలీసు అనుమతి తీసుకోవాలని, మీసేవా ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో 40 గ్రామ పంచాయతీలుండగా నాలుగు క్లస్టర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే తప్పనిసరిగా మైక్, డీజేపర్మిషన్ తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ కూసుపుడిజగదీష్, ఎంపీడీవో సిలార్‌సాహెబ్ అదనపు ఎస్ఐ రామలింగారెడ్డి, పాల్గొన్నారు.

మోమినాన్ పాఠశాలలో మాక్ పోలింగ్

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని మోమినాన్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. శనివారం నోబ్యాగ్‌లెస్‌డే సందర్భంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఈ కార్యక్రమం నిర్వహించామని పాఠశాల యాజమాన్యం తెలిపింది. అదనపు కలెక్టర్ శ్రీజ పాఠశాలను సందర్శించి ఎన్నికల విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విజేతలను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంవో ప్రవీణ్‌కుమార్,ఎంఈవో శైలజాలక్ష్మీ, హెచ్‌ఎం శారద, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సీపీఎస్ ఉద్యోగుల బ్లాక్ డే విజయవంతం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.28కు వ్యతిరేకంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలల్లో, శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్(ఐడీవోసీ)లో జరిగిన నిరసన కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈయూ జిల్లా అధ్యక్షుడుచంద్రకంటి శశిధర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు వేముల శంకర్,పవన్, గిరిజా,కేశవ లక్ష్మి, అజీబాబా, టీఎస్ టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్,టీఎస్ టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోశాలలకు దాణా వితరణ

ఖమ్మంఖానాపురం హవేలి,ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస బహుళ అమావాస్య సందర్భంగా శనివారం శ్రీ స్తంభాద్రి సేవాసమితి ఆధ్వర్యంలో దాల్ మిల్‌యజమానులు, గ్రేయిన్‌మార్కెట్ వ్యాపారులు, మిత్రులు, సేవాసమితి సభ్యులు సేకరించిన రూ.62వేల విరాళాన్ని గొల్లగూడెం లోని ఓం శ్రీకృష్ణ గోశాల, టేకులపల్లి లోని శ్రీ వెంకటేశ్వర గోశాల, శ్రీలక్ష్మీ రంగనాధ గోశాలలకు బెల్లం, పచ్చిగడ్డి కట్టలు, తవుడు, మినప, పెసర, కంది, బొబ్బర చున్నీ, వరిపేలాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, గోదాణాను ఆయా గోశాలల బాధ్యులకు దాతల పక్షాన వితరణ అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీ నరసింహరావు, సభ్యులు రామారావు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు

సురవరం సంతాప సభలో కొనియాడిన వక్తలు



మాట్లాడుతున్న జితేందర్‌రెడ్డి

ఖమ్మంసంక్షేమ విభాగం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశనుంచి ఉద్యమాల్లో పాల్గొన్న సురవరం సుధాకర్‌రెడ్డి జీవితకాలం పాటు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల కోసం పని చేశారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో సుధాకర్‌రెడ్డి సంతాప సభను నిర్వహించారు. విద్యార్థిదశ నుంచి జాతీయ స్థాయి వరకు క్రమశిక్షణతో ఎదిగారని గుర్తు చేశారు. ఉపాధిహామీ పథకం, సమాచార హక్కు చట్టం వంటి కీలక చట్టాల రూపకల్పనలో సురవరం సూచనలు పని చేశాయన్నారు.ఆయన స్ఫూర్తిగా కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. నాయకులు సిద్దనేని కర్ణకుమార్, శింగు నిర్సంహారావు, పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాల సాంబశివరెడ్డి, కూచిపూడి రవి, వర్గ నర్సింహారావు సంతాప సభలో పాల్గొన్నారు.ప్రియదర్శిని డిగ్రీకాలేజీలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ మాజీజాతీయ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, లక్ష్మణ్, నాగుల్‌మీరా, శివ, మనోజ్,వంశీ, గోపి సంతాపం తెలిపారు.

పలువురి నివాళి

ఖమ్మంమార్కెట్: సీపీఐదిగ్గజ నేత, జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల పలువురు జిల్లా నాయకులు నివాళులు అర్పించారు. మాజీఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతామధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పలువురు నాయకులు తమ సంతాపాన్ని ప్రకటించారు. క్రమశిక్షణతో జాతీయస్థాయికి ఎదిగారని గుర్తు చేశారు.

సురవరం మృతికి సీపీఐ సంతాపం

నేలకొండపల్లి: సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పట్ల మండల సీపీఐ ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. జిల్లా నాయకుడు కర్నాటి భానుప్రసాద్ మాట్లాడుతూ సురవరం పార్టీని ముందుకు నడిపిన నాయకుల్లో ఒకరన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. పేద ప్రజల సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేసిన గొప్ప కమ్యూనిస్టు యోధుడిని పార్టీ కోల్పోయిందని భానుప్రసాద్ అన్నారు. సంతాపం తెలిపిన వారిలో మారిశెట్టి వెంకటేశ్వరరావు, పాల్తియా శ్రీనివాసరావు, కనకబండి సీగయ్య, చావా గణపతిరావు, కాశిబోయిన అయోధ్య ఉన్నారు.

ట్రైసైకిళ్లకు వైకల్యం!



నగరంలోని ప్రధాన ఆసుపత్రిలో రోగులను తరలించే ట్రైసైకిళ్ల చక్రాలు విరిగాయి. ప్రమాదభరితంగా మారాయి. ఈ ట్రైసైకిళ్లలో రోగులను ఓపీలు, సిమెంట్ కట్లు వేసేందుకు తరలించేటప్పుడు ఎక్కువగా వాడుతున్నారు. ఈ కారణంగా రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం





సోంచ్ ఫౌండేషన్‌కు రూ. 50వేల వితరణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): అంధుల కోసం విశేష సేవలు అందించే సోంచ్ ఫౌండేషన్‌కు నగరంలోని మిలీనియం పాటశాల విద్యార్థులు, యాజమాన్యం రూ.50వేలు అందించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులకు ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు మొహమ్మద్ బషీర్ అలీ, కార్యదర్శి ప్రతినిధి మొహమ్మద్ జాహిద్, ప్రిన్సిపాల్ తబస్సుమ్ మాట్లాడారు. విద్య అంటే కేవలం పాఠ్యపుస్తకాల్లో పరిమితం కాదు. సమాజంలోని వెనుక బడినవారికి చేయూతనివ్వడం కూడా విద్యలో ముఖ్య భాగమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందించడం మాపాఠశాల ముఖ్యలక్ష్యం అన్నారు.

నగర సమస్యలపై పాలకవర్గం దృష్టి పెట్టాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి విక్రమ్

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ప్రధానమైన సమస్యలపై పాలకవర్గం దృష్టిసారించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మం అర్బన్ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. పాత మున్సిపల్ కార్యాలయం నుంచి చర్చికాంపౌండ్ వరకు విస్తరణ పనులు పూర్తి కాలేదని ఆరోపించారు. రాపర్తినగర్ సెంటర్ నుంచి మయూరి సెంటర్ వరకు డివైడర్లు తొలగించి ప్యాచ్ వర్క్ పనులు మాత్రం చేయలేదని విమర్శించారు. పారిశుధ్యం సరిగా లేదని, ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఆరోపించారు. నాయకులు ఎస్‌కే మీరా, బీ ఉపేంద్ర, నాగేశ్వరరావు, ఎం ఉపేంద్ర, జనార్ధన్, వెంకన్న పాల్గొన్నారు.

కమీషన్ చెల్లింపులపై అధికారులకు వినతి

ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): ఐదునెలలుగా రేషన్‌డీలర్లకు ఇవ్వాల్సిన కమీషన్‌ను చెల్లించాలని జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు బానోతు వెంకన్న, జానిమియా, దొండదుర్గయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం పిలుపుమేరకు సోమవారం జిల్లాలోని రేషన్ డీలర్లు తమ మండల తాహసీల్దారు, ఆర్డీవో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందచేయనున్నట్లు తెలిపారు. మండల, డివిజన్, జిల్లాస్థాయి అధికారులకు రేషన్‌డీలర్లు కలిసి మర్యాదపూర్వకంగా వినతి పత్రాలను అందచేయాలని వారు కోరారు.

ఎర్నేనికి గల్లా అభినందనలు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): స్తంభాద్రి అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఖమ్మం చైర్మన్‌గా నియమితులైన ఎర్నేని రామారావును బీజేపీ రాష్ట్ర నాయకుడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి గల్లా సత్యనారాయణ శనివారం శుభాకాంక్షలు తెలిపారు. బ్యాంకును అభివృద్ధిపథంలో నడుపుతున్నారని, అలాంటి వ్యక్తికి చైర్మన్‌గా మరోసారి నియమితులు కావడం శుభపరిణామమన్నారు.

అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్

బీజేపీ పాలేరు ఇన్‌చార్జ్ వీరభద్రప్రసాద్



ధర్నా చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

నేలకొండపల్లి,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): అలవి కాని హామీలను ఇచ్చి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. వీటిని అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందని పాలేరు బీజేపీ ఇన్‌చార్జ్ మార్తి వీరభద్రప్రసాద్ విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం కార్యకర్తలు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. తహీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మర్రి ఎర్రయ్యలకు సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందించారు. అనంతరం వీరభద్ర ప్రసాద్ మాట్లాడుతూ అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ ఎన్నో హామీలను ఇచ్చిందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ఘోర వైఫల్యం చెందిందన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో సైతం కాంగ్రెస్ విఫలమైందని, దీంతో పంచాయతీలకు నిధులు రావటం లేదన్నారు. నిధుల లేమితో గ్రామాల్లో పనుల నిర్వహణ సరిగా లేదన్నారు. దీంతో దోమల బెడద ఎక్కువై సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్.షర్ఫుద్దీన్ నాయకులు నూరేపల్లి జ్ఞానరత్నం, బాజా రామకృష్ణ, మల్లెల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ వైకుంఠధామం.. స్వర్గధామం

- అల్లీపురంలో అంత్యక్రియలకు పూర్తి సౌకర్యాలు
- వర్షాకాలంలోనూ ఇబ్బందిలేకుండా చర్యలు
- ఉమ్మడి జిల్లాలోనే మోడల్‌గా నిర్మాణం





వైకుంఠధామం ద్వారం, ఆధునిక శ్మశాన వాటిక ఘట్టాలు

ఖమ్మంకార్పొరేషన్,ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): నగరంలోని 15వడివిజన్‌లోని అల్లీపురం వైకుంఠధామం రోల్‌మోడల్‌గా నిలుస్తోంది. అంత్యక్రియల క్రతువు నిర్వహించేందుకు ఇబ్బందిపడకుండా సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. గ్రామం నుంచి వైకుంఠధామం వరకు వెళ్లేందుకు రూ.50లక్షలతో సీసీ రహదారి నిర్మాణం చేశారు. ఇక వైకుంఠదామంలోకి కాలు పెడితే ఇది నిజంగానే స్మశాన వాటిక అనే రీతిలో అహ్లాదంగా ఉంది. రూ.1.5కోట్లతో ఐదెకరాల స్థలానికి ప్రహరీ నిర్మాణం చేశారు. స్వాగతద్వారాలతో పాటుగా శాశ్విత భవనాలు నిర్మాణం చేశారు. వైకుంఠ ధామం కార్యాలయం, కర్మ పూజలు చేసేందుకు మండపాలు, స్నానాల గదులు, మరుగుదొడ్లు, దింపుడు కల్లాల కోసం రెండు ఘట్టాలు, ఆధునిక శ్మశాన వాటిక ఘట్టాలు వాటి ఎదురుగా అంత్యక్రియలు చేసేందుకు గ్యాలరీని నిర్మాణాలు చేశారు. అంత్యక్రియలకు హాజరయ్యే వారికి ఆహ్లాదంగా ఉండేందుకు చెట్లు, పూల మొక్కలు, కూర్చొనేందుకు కూర్చీలు ఇలా పార్కు తరహాలో నిర్మాణాలు చేశారు. అంత్యక్రియల నిర్వాహణకు కట్టెల కోసం మరో శాశ్విత భవనం నిర్మాణం చేశారు. నిరాటంకంగా ముసురేసినా వర్షాకాలంలోను ఎటువంటి ఆటంకాలు లేకుండా అంత్యక్రియలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.




ఆహ్లాదం కోసం పక్షుల సెట్టింగ్‌లు



శ్మశాన ఘట్టాల ఎదుట బంధువులు చూసేందుకు గ్యాలరీ



మరుగుదొడ్లు, స్నానాలకు ప్రత్యేక గదులు



దింపుడు కల్లానికి ప్రత్యేక స్థానం

పీఎం సురక్షా బీమాను వినియోగించుకోవాలి

వైరా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రధానమంత్రి సురక్షా బీమా, జీవనజ్యోతి బీమా పథకాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎస్‌బీఐ ఖమ్మం రీజనల్ మేనేజర్ రాజశేఖర్ సూచించారు. వైరా మునిసిపాలిటీ ఒకటోవార్డులో శనివారం ప్రధానమంత్రి సురక్షా బీమా, జీవనజ్యోతి బీమాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్‌బీఐలో ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికి ఏడాదికి రూ.20కు సురక్షా బీమా అలాగే రూ.436 ప్రీమియం చెల్లించిన వారికి రూ.రెండులక్షల బీమాను కల్పించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐ నర్సింహారావు బదిలీ

కారేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ-1పనిచేసిన సామినేని నర్సింహారావు శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.నర్సింహారావు బదిలీతో ఆయన స్థానంలో తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న వసీం బదిలీపై వస్తున్నారు.

మిషన్ భగీరథ కార్మికుల ధర్నా

వైరా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైరాలో శనివారం మిషన్ భగీరథ కార్మికులు ధర్నా నిర్వహించారు. గత మూడునెలల నుంచి వేతనాలు రాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో మిషన్ భగీరథ జేఏసీ ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. 18మండలాలకు మంచినీటిని సరఫరా చేసే వైరా రిజర్వాయర్ వద్దనున్న మిషన్ భగీరథ పథకం వద్ద ఈ ఆందోళన చేపట్టారు.

భూ భారతి వచ్చినా తప్పని తిప్పలు

▸ ఆర్ఎస్ఆర్ ఖాళీ లేదు.. మిస్సింగ్ సర్వే నెంబర్ సమస్య తీరదు

సత్తుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భూ యజమానుల సమస్యలు తీరడం లేదు. ధరణి పోర్టల్ పోయి భూ భారతి వచ్చినా ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్లు పరిస్థితి ఉంది. భూ భారతి వచ్చిన తరువాత ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రచారం జరిగినా భూ యజమానులు మాత్రం ఏళ్ల తరబడి తమ భూములకు సంబంధించి టైటిల్ దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా మిస్సింగ్ సర్వే నెంబర్‌కు సంబంధించి సమస్య పరిష్కారానికి ఆర్ఎస్ఆర్ ప్రధాన అడ్డంకిగా మారింది. దీంతో గతంలో తమ భూములు ఆన్‌లైన్ కాలేదని. మొత్తం విస్తీర్ణం నమోదు కాని వారు, కొన్ని సర్వే నెంబర్ల వివరాలు భూ భారతి పోర్టల్‌లో నమోదు కాలేదని కాలేదని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మిస్సింగ్ సర్వే నెంబర్ల సమస్య

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మిస్సింగ్ సర్వే నెంబర్ల సమస్యను భూ యజమానులు ఎదుర్కొంటున్నారు. వాస్తవంగా తాము సాగు చేసుకుంటున్న భూముల వివరాలు మొత్తం పోర్టల్‌లో నమోదు కాలేదని యజమానుల వాదన. ఇలాంటి వారు ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నారు. తరతరాలుగా భూములు అనుభవిస్తూ.. సాగులో ఉన్నా వారికి పట్టాదార్ పాస్‌పుస్తకం రాని వారు అనేక మంది ఉన్నారు. కొందరికి పాస్‌పుస్తకం వచ్చినా అందులో వారి భూముల విస్తీర్ణం పూర్తి స్థాయిలో నమోదు కాకపోవడం లాంటి సమస్యలు ఉన్నాయి. ఇలాంటి సమస్యలతో భూ భారతి గ్రామ సభల్లో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందజేశారు.

ఆర్ఎస్ఆర్ అడ్డంకి..

మిస్సింగ్ సర్వే నెంబర్ కింద భూ యజమానులు దరఖాస్తు చేసిన తరువాత రీసెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) ఖాళీ ఉంటేనే దరఖాస్తును ఆమోదించి సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయగలుగుతారు. ఒక సర్వే నెంబర్‌లో ఎంత విస్తీర్ణం భూమి ఉంది అనేది ఆర్ఎస్ఆర్ ద్వారా నిర్ధారిస్తారు. గతంలో మాన్యువల్ పహణీ ఉన్న సమయంలో ఒక సర్వే నెంబర్‌లో మొత్తం విస్తీర్ణం ఖాస్రా పహణీ ప్రకారం 100 ఎకరాలు ఉంటే అంతకు మించి విస్తీర్ణంలో పేర్లు నమోదు చేయడం వల్ల సమస్యలు ఏర్పడ్డాయి. ధరణి పోర్టల్ ప్రవేశ పెట్టిన సమయంలో పోర్టల్‌లో పేర్లు, విస్తీర్ణం ఆన్‌లైన్ చేసే సమయంలో కొందరు భూ యజమానులకు సంబంధించిన వివరాలు నమోదు కాలేదు. కొందరి భూములకు సంబంధించి కొన్ని సర్వే నెంబర్‌లలో భూములు నమోదైనా మరి కొన్ని సర్వే నెంబర్లలో భూముల నమోదు కాలేదు. అదే సమయంలో పొజిషన్‌లో లేని వారి పేర్లతో నమోదు కావడం వారికి పాస్‌పుస్తకాలు కూడా జారీ కావడంతో వాస్తవంగా సాగులో ఉన్న వారి భూములు నమోదు కాలేదు. ధరణి పోర్టల్‌లో ఖాస్రా పహణీ ప్రకారం ఉన్న విస్తీర్ణం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. ఒక సర్వే నెంబర్‌లో గరిష్ట విస్తీర్ణానికి మించి ఒక్క గుంట భూమి కూడా నమోదు కాదు. ప్రస్తుత భూ భారతి పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు.

అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు

మిస్సింగ్ సర్వే నెంబర్, పూర్తి విస్తీర్ణం నమోదు కాకపోవడంతో పెద్ద సంఖ్యలో భూ యజమానులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమ భూముల వివరాలు నమోదు కాలేదని, కొన్ని సర్వే నెంబర్లు రాలేదని చెపుతున్నారు. కాని ఆర్ఎస్ఆర్ ఖాళీ ఉంటే సమస్య పరిష్కారం అవుతోంది. ఆర్ఎస్ఆర్ ఖాళీ లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. వాస్తవంగా పొజిషన్‌లో ఉన్న విస్తీర్ణానికి మించి టైటిల్ పొందిన వారు కూడా ఉన్నారు. వీరి వల్ల ఆర్ఎస్ఆర్ ఖాళీ లేకుండా పోయింది. పొజిషన్‌లో లేకుండా, వాస్తవ విస్తీర్ణానికి అదనంగా నమోదు చేసుకున్న వారిని తొలగించేందుకు గత ధరణి పోర్టల్‌లో ఎటువంటి అవకాశం లేదు. కాని భూ భారతి వచ్చిన తరువాత అనర్హులను తొలగించే అవకాశం ఉంది. సర్వే చేసి ఎవరైతే పొజిషన్‌లో ఉన్నారో వారిని ఉంచి పొజిషన్‌లో లేకుండా టైటిల్ పొందిన వారిని తొలగించే అవకాశం కల్పించారు. ఎవరైనా యజమాని మిస్సింగ్ సర్వే నెంబర్ కింద దరఖాస్తు చేసుకుంటే ఆర్ఎస్ఆర్ ఖాళీ లేకుంటే సదరు సర్వే నెంబర్ విస్తీర్ణంలోని యజమానులందరికీ నోటీసులు జారీ చేసి సర్వే చేయాల్సి ఉంటుంది. కానీ మిస్సింగ్ సర్వే నెంబర్, విస్తీర్ణంలో తేడాలు, భూములు ఆన్‌లైన్ కాని వారి నుంచి వందల సంఖ్యలలో దరఖాస్తులు వస్తూండటంతో రెవెన్యూ శాఖకు తలకి మించిన భారంగా మారుతోంది. మరో పక్క సర్వే చేసే ముందు రైతులకు నోటీసు ఇచ్చే సందర్భంలో ఎవరైనా అభ్యంతర పెడితే మొత్తం ప్రక్రియ నిలిచిపోయే పరిస్థితి ఉంది. మొత్తంగా మిస్సింగ్ సర్వే నెంబర్ల సమస్య భూ యజమానుల వేధిస్తోంది.

సృజనాత్మకత పెంచేందుకే నో బ్యాగ్ డే

▸ డీఈవో నాగపద్మజ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఈవో

ముదిగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకే ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు డీఈవో నాగపద్మజ అన్నారు. శనివారం ముదిగొండ పాఠశాలలో నో బ్యాగ్‌డే కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రతి నాల్గో శనివారం నో బ్యాగ్ డేను నిర్వహించాలని ఆమె సూచించారు. ఎంఈవో రమణయ్య, మండలపరిషత్ సూపరింటెండెంట్ భాస్కర్‌రావు, భవానీ, రోషిని తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నో బ్యాగ్ డే

ఏన్కూరు: మండల పరిధిలోని బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన నో బ్యాగ్ డే కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఇన్‌చార్జి హెచ్ఎం సాగి సుజాత, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, రామారావు, శ్రీనివాసరావు, నరేష్, విజయశ్రీ, భారతి, భావ్‌సింగ్ పాల్గొన్నారు.

తల్లాడ: తల్లాడ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు . విద్యార్థులు పుస్తకాలు లేకుండా ఆటపాటలతో ఉల్లాసంగా గడపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టారు.

బోనకల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు.

పెనుబల్లి: పీఎంశ్రీ జడ్పీఉన్నత పాఠశాల వీఎంబంజర్‌లో నాల్గవ శనివారం నోబ్యాగ్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులురామారావు, రామారావు, రాజు, భాస్కర్‌రావు, జాన్‌బీ పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: దృశ్య, శ్రవణ, డిజిటల్ సాధనాలే అభ్యాస అనుభవాన్ని మెరుగుపరుస్తాయని ఎంఈవో నక్కా రాజేశ్వరరావు అన్నారు. నో బ్యాగ్ డేను పలు ప్రాథమిక పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.

రక్తదానం చేసేవారు సమాజ సేవ చేయగలరు: ఎమ్మెల్యే



బ్లడ్‌క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేవారు సమాజంతోపాటు ప్రజలకు సేవ చేయగలుగుతారని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో స్థానిక జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ప్రారంభించారు. అత్యవసర సమయంలో రక్తదానం మరొకరి ప్రాణాలను నిలబెడుతుందని, రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా యువత రక్తదానం చేసినట్లయితే 1యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చునన్నారు. ఈ సందర్భంగా 25మంది రక్తదానం చేయగా ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ చీఫ్ డాక్టర్ ఆకాష్, బ్రహ్మకుమారీస్ బాధ్యులు రాధిక, లయన్స్‌క్లబ్ బాధ్యులు దారా కృష్ణారావు, పెనుగొండ రమేష్, సింగరేణి రవి, నర్సింహులు, వరప్రసాద్, రవి, నరసింహారావు, పాల్గొన్నారు.

ఆగిన బదిలీ.. కమిషనర్‌గా వేణు కొనసాగింపు



వైరా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణునే. ఆయన బదిలీని నిలిపివేస్తూ శనివారం రాష్ట్ర పురపాలకశాఖ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 20వతేదీన రాష్ట్రంలోని 47మంది మునిసిపల్ కమిషనర్లను మునిసిపల్‌శాఖ సెక్రటరీ బదిలీ చేశారు. ఆ బదిలీల్లో వైరా మునిసిపల్ కమిషనర్ చింతా వేణును ఉమ్మడి నల్గొండ జిల్లా నందికొండ కమిషనర్‌గా బదిలీ చేశారు. నందికొండ మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న యు.గురులింగంను వైరా మునిసిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆమేరకు గురులింగం శుక్రవారం వైరా మునిసిపల్ కార్యాలయానికి చేరుకుని తాను బాధ్యతలు చేపట్టానని ఉన్నతాధికారులకు మెయిల్ పంపించానని చెప్పుకోవడం, ఆ తర్వాత ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌ను కలవడం, వెనువెంటనే నాటకీయ పరిణామాలుగా జరిగిపోయాయి. స్థానిక అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకులు చింతా వేణునే కమిషనర్‌గా కొనసాగించాలని ఎమ్మెల్యేపై వత్తిడి తేవడంతో ఆయన సంబంధిత మంత్రి, అధికారులతో మాట్లాడి ఆయన బదిలీని నిలుపుదల చేయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దాంతో ఆశాఖ సెక్రటరీ ఈనెల 20వతేదీకి ముందు పరిస్థితిని కొనసాగిస్తూ వేణు తిరిగి మళ్లీ వైరా మునిసిపల్ కమిషనర్‌గా, గురులింగంను నందికొండ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

13న జాతీయ లోక్ అదాలత్

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేలా కృషి చేయాలని 6వ అదనపు సీనియర్ సివిల్ జడ్జీ మారగాని శ్రీనివాస్ కోరారు. శనివారం సత్తుపల్లి కోర్టులో సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ ఎస్‌కే.మీరాఖాసీంసాహెబ్, జూనియర్ సివిల్ జడ్జీ పీ.నాగసుమబాల, అదనపు జూనియర్ సివిల్ జడ్జీ వడ్డె లావణ్య, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి జే.గోపాలరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపూల వెంకటేశ్వరరావు, కల్లూరు ఏసీపీ ఏ.రఘు, సీఐలు ముత్తిలింగం, శ్రీహరిలతో పాటు ఎస్ఐలు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

షరతులు లేకుండా సరిపడా యూరియా అందించాలి

మధిర రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): షరతులు లేకుండా రైతులకు సరిపడా యూరియా అందించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రైతు సహకార సంఘం కార్యాలయం ఎదుట రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతి రోజూ స్టాక్ ఉంటుంది కానీ ప్రతిరోజూ రైతు యూరియా కోసం ఫెర్టిలైజర్ షాపుల చుట్టూ తిరుగుతూ నష్టపోతున్నారన్నారు. అధికార పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య, మందడపు ఉపేంద్రరావు, తేలప్రోలు రాధాకృష్ణ, కొంగర రంగయ్య, రాజారావు, పర్సారి అప్పారావు, షేక్.సైదులు పాల్గొన్నారు.

నానో యూరియాపై క్షేత్రస్థాయి ప్రదర్శన

ఏన్కూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నానో యూరియాపై తిమ్మరావుపేట గ్రామంలో శనివారం ఏవో నరసింహారావు క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నానో డీఏపీ స్ప్రేచేసే విధానాన్ని రైతులకు ఊచించారు నానో యూరియా, డీఏపీ వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. ఏఈవోలు బాలకృష్ణ, శ్రీకాంత్, రైతులఉ పాల్గొన్నారు.

దళితుల భూములపై ప్రభుత్వ జోక్యం సరైనది కాదు

కొణిజర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దిద్దుపుడి గ్రామంలో గత 40సంవత్సరాల నుంచి సాగు చేసుకుని అనుభవిస్తున్న భూములపై ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సరైనదికాదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు, మాజీ జడ్పీటీసీ దొండపాటి రమేష్ అన్నారు. శనివారం గ్రామంలోని కొంతమంది దళితులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టా హక్కు పత్రం కల్పించాలని, ఎన్నో ఏండ్లుగా సాగు చేస్తున్న దళిత రైతుల భూములను వారి పేర్లపై పట్టా చేయాలని కోరారు. నాయకులు, భూ బాధితులు రత్నమయ్య, మరియమ్మ, అనీల్, భాస్కర్, రాము, రమేష్, సురేష్, రవి, ఏసోబు, నాగరత్నం, బాలశౌరి, బుజ్జమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల మార్పిడికి ప్రజలు సహకరించాలి

ముదిగొండ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్లను మార్చేందుకు ప్రజలు సహకరించాలని విద్యుత్‌శాఖ ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి సూచించారు. వెంకటాపురం గ్రామంలో ఇళ్లపై 11కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయని గ్రామస్థులు ప్రజావాణిలో దరఖాస్తు చేయగా విద్యుత్ లైన్ల సమస్య పరిష్కారం కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఈ విద్యుత్ లైన్ల మార్పిడికి గ్రామస్థులు సహకరించాలని అప్పుడే విద్యుత్ లైన్ల సమస్య పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. డీఈ నాగేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావు, ఏడీఈ రామకృష్ణ, ఆర్అండ్‌బీ ఈఈ పవర్, డీఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఓటమి భయంతో ఎన్నికలకు వెనుకడుగు

సత్తుపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలం ముగిసినా ఓడిపోతామన్న భయంతోనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఎన్నికలకు వెనుకడుగు వేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవకీ వాసుదేవరావు అన్నారు. ఈ సందర్భంగా శనివారం బీజేపీ నాయకులతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. బీజేపీ ప్రవాసీ యోజనలో భాగంగా మండలంలోని పలు గ్రామాలను సందర్శించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు తాగునీరు, పారిశుధ్య సమస్యలతోపాటు రావాల్సిన నిధులు వ్యర్థమవుతున్నాయని, ప్రజల గోడు వినే ప్రజాప్రతినిధులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాఘవరావు, విజయ్, సాలి శివ, లక్ష్మీనారాయణ, నరేష్, శ్రీను, రహ్మతుల్లా, సుబానీ, సత్యనారాయణరెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణస్వామి, శివ, కార్తీక్, వసంతరావు, శేషగిరిరావు, రామారావు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

బోనకల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఆధార్ లేని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంఆర్సీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని శనివారం జిల్లా సెక్టోరియల్ అధికారి రామకృష్ణ సందర్శించారు. ఆధార్ లేని పిల్లలు తప్పని సరిగా కేంద్రానికి వచ్చి నమోదు చేసుకోవాలని కోరారు. ఎంఈవో పుల్లయ్య, పాల్గొన్నారు.

రేపు ఈజీఎస్ సామాజిక తనిఖీ

వైరా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25వతేదీన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మండల 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను ఏర్పాటు చేశామని ఎంపీడీవో సక్రియ తెలిపారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి 31వతేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నామని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం వడ్డించాలి

కారేపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హాస్టలలో విద్యార్థులకు మోనూ ప్రకారం భోజనం వడ్డించాలని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నరేందర్‌రావు, ఎంపీవో రవీంద్రప్రసాద్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, గాంధీనగరంలోని ట్రైబెల్ వెల్ఫేర్ పాఠశాలలోనే హస్టళ్లను తనిఖీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హస్టళ్లను తనిఖీ చేస్తున్నట్లు వారు తెలిపారు. విద్యుర్థులకు వేడివేడి భోజనం వడ్డించాలని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగారు.


ఘనంగా శీలం జయంతి వేడుకలు



పూల మాలలు వేస్తున్న కాంగ్రెస్‌నాయకులు

ఎర్రుపాలెం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా తొలిమంత్రి, దివంగత కాంగ్రెస్ నేత శీలం సిద్ధారెడ్డి 99వ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సిద్ధారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత గ్రామాలలో ప్రజలు వెనుకబాటుకు ప్రధాన కారణం విద్య లేమి అని గ్రహించి తన సొంత గ్రామమైన బనిగండ్లపాడులో హరిజన, గిరిజన వెనుకబడిన తరగతి వర్గాల ప్రజల పిల్లల కోసం పాఠశాల, హాస్టల్ స్థాపించి స్వయంగా పర్యవేక్షించి వేల మంది విద్యార్థులకు విద్యనందించిన ఘనత సిద్ధారెడ్డిదని వారు తెలిపారు. కాగ్రెస్ పార్టీ తాలూకా ప్రెసిడెంట్ నుంచి ఏఐసీసీ మెంబర్‌వరకు, స్వాతంత్ర సమరయోధుడిగా క్యాంపు ఇన్‌చార్జిగా, రాష్ట కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా, భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా, రచయితగా 1954 లోనే ప్రజల శ్రమదానంతో ఎన్నో రహదారులను నిర్మించడంతోపాటుగా బనిగండ్లపాడు గ్రామంలో రాష్ట్రంలోనే తొలి ఆడిటోరియంను, పశువుల ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీసీ, ఎస్సీహాస్టల్ బవనాలను గ్రంథాలయాలను ప్రజల భాగస్వామ్యంతో నిర్మించి గొప్ప ఆదర్శజీవిగా ప్రజల్లోనిలిచారన్నారు. మధిర మార్కెట్ కమిటీచైర్మన్ బండారు నరసింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకుఉల కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘ నాయకుఉల, యూత్ కాంగ్రెస్ నాయకుఉల పాల్గొన్నారు.

యూరియా కొరతపై బీజేపీ నిరసన



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై కల్లూరులో శనివారం రైతులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మంపార్లమెంట్ ఆ పార్టీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. గడచిన పది సంత్సరాల కాలంలో తెలంగాణలో యూరియా కొరత లేకపోగా ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 2024 సంవత్సం వర్షాకాల ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం 10.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అడిగితే కేంద్రం 12.69 మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి ఇచ్చిందన్నారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించిన యూరియా 9.66 మెట్రిక్ టన్నులు కాగా ఇంకా మిగలు యూరియా 3.23 లక్షల టన్నుల యూరియా ఉందని అన్నారు. గత యాసంగి గాను 3.17 మెట్రిక్ టన్నులు కావాలని అడిగితే కేంద్రం 5.04 మెట్రిక్ టన్నుల యూరియాను అందించగా అందులో కూడా 1.28 లక్షల టన్నుల యూరియాను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం వినియోగించిందన్నారు. ఈ మేరకు నంబూరి రామాలింగేశ్వరావు ఆధ్వర్యంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మండల బిజెపి అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, నాయకులు తుమ్మలపూడి పుల్లారావు, వెంకటరామిరెడ్డి, అప్పారావు, పసుపులేటి సుబ్బారావు, వెంకటరామయ్య, అనంగి నరిసింహారావు, నాగులు, రంగు రవి పాల్గొన్నారు.

అక్రమ భవంతుల నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో అక్రమ భవంతుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఎన్జీవో, విశ్రాంత ఉద్యోగి కొల్లి ఆశోక్‌చౌదరి ఈ మేరకు కల్లూరు సబ్‌కలెక్టర్‌కు కలిసి శనివారం ఫిర్యాదు చేశారు. స్థానికంగా ప్రధాన రహదారుల పక్కన అక్రమ నిర్మాణలు చేపడుతన్నప్పటికి అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహారిస్తున్నారని ఆయన అన్నారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవంతులతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందన్నారు. ఈ విషయమై మునిసిపాలిటీ కమిషనర్ సంపంత్‌కుమార్ వివరణ ఇస్తూ గతంలో కల్లూరు గ్రామ పంచాయితీగా ఉన్నప్పుడు మాత్రమే సదరు భవనాలు నిర్మించారని అన్నారు. వాటి యాజమానులకు నోటీసులు అందించామన్నారు.

సురవరం మరణం కార్మికులకు తీరనిలోటు

కొణిజర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యుడిగా పని చేసిన సురవరం సుధాకర్‌రెడ్డి మరణం కార్మిక, కర్షలకు తీరని లోటని సీపీఐ జిల్లా నాయకులు, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అన్నారు. శనివారం స్థానిక దొండపాటి భవనంలో స్వర్ణ రమేష్ అధ్యక్షతన జరిగిన సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2004లో కమ్యూనిస్టు పార్టీల మద్దతుతో కేంద్రంలో యూపిఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అటవి హక్కుల చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం అనేక చట్టాలను సాధించడంలో సూరవరం కీలకపాత్ర పోషించాడని తెలిపారు. ఈ సంతాప సభలో నాయకులు తండు సోమయ్య, కొమ్మినేని వెంకయ్య, రాంబాబు, గిరి, ముత్తయ్య, అనీల్, మరియమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

బోనకల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాధనంతో అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు మాత్రమే అందించాలని బీజేపీ జిల్లా నాయకుడు రుద్ర ప్రదీప్ విజ్ఞప్తి చేశారు. బీజేపీ మండల అధ్యక్షురాలు తాళ్లూరి మౌనిక, జిల్లా, మండల నాయకులు తాళ్లూరి సురేష్, మందపల్లి పాపారావు, జంపాల రవి, కాలసాని పరుశురాం, సురేష్, రామారావు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయంలోని యాడీసీకి శనివారం ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లిక శ్రీకాంత్, రమణయ్య, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి రాములు పాల్గొన్నారు.

పెనుబల్లి: మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఎస్వీ.నారాయణమూర్తి శనివారం బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొర్రా నర్సింహారావు, జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు రవి రాథోడ్, అధికార ప్రతినిధి మధుసూదన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రాము, గాయం నాగరాజు పాల్గొన్నారు.

చింతకాని: మండలంలో నెలకొన్న పలు సమస్యలపై శనివారం తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికు బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. మేకల నాగేంద్ర, మందడపు సుబ్బారావు, మద్దినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దేవాలయానికి హరికృష్ణారెడ్డి విరాళం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ద్వారకాపూరి కాలనీలో వేంచేసియున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి మండలంలోని నారాయణపురంకు చెందిన శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి శనివారం రూ.1,13,333విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్లూరు అంకంరాజు, పాకలపాటి శ్రీను, ద్రోణంరాజు మల్లిఖార్జునశర్మ, రాగాల చంద్రారెడ్డి, తోట కిరణ్, గాదె నాగు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాలడుగులో కోతుల బీభత్సం

వైరా, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు గ్రామంలో శనివారం సాయంత్రం కోతులు బీభత్సం సృష్టించాయి. ఈ కోతుల దాడిలో తల్లీ, కుమారుడు, మరో మహిళ గాయపడ్డారు. ఇంటిముందు కూర్చోని ఉన్న వనమా బేబమ్మ, ఆమె కుమారుడు సుబ్బారావుపై మూకుమ్మడి కోతుల గుంపు దాడి చేసింది. వృద్ధురాలైన బేబమ్మ చేతులను రక్కిపెట్టాయి. పక్కనే ఉన్న కుమారుడు సుబ్బారావు వీపు ఇతర భాగాల్లో కరిచి గాయపర్చాయి. అదే సమయంలో రోడ్డుపైన నడిచి వెళ్తున్న మరో మహిళపై కూడా కోతుల గుంపు దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది.

ముత్యాల కవచాలంకారంలో జమలాపురం శ్రీవారు

ఎర్రుపాలెం, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించి, ముత్యాల కవచాన్ని అలంకరించారు.. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. పొలాల అమావస్య కావడంతో పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆలయంలో రైతులు, మహిలలు పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ సిబ్బది ఉచితంగా అన్నవితరణ చేశారు. మధిర సివిల్ కోర్టు జడ్జి వేముల దీప్తి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం అర్చకులు ఆమెను ఆలయలోకి ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వదించారు. అనంతరం శ్రీవారి శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, దేవాలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు

పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్

మధిర రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శనివారం ముదిగొండ తహసీల్దార్ సునీత ఎల్జిబెత్ తనిఖీ చేశారు. వైద్య సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.


బస్టాండ్‌ను సందర్శించిన డీఎం

పెనుబల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్ బస్టాండ్‌లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను శనివారం సత్తుపల్లి ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి, ఎస్ఐ వెంకటేష్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ మేరుగు రవీంద్రనాథ్‌కు పలు సూచనలు చేశారు. తిరువూరు రోడ్డు వైపు ఉన్న డ్రెయినేజీలో పూడిక తొలగింపు, ఆవరణంలో చెత్తను తొలగించి శుభ్రపర్చటాన్ని పరిశీలించారు. దీంతోపాటు బస్టాండ్ ఆవరణంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి

చింతకాని, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన జిల్లా ఆత్మ కమిటీ సభ్యులు కొప్పుల గోవిందరావు తండ్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొప్పుల బుచ్చయ్య(80) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సందర్శించి కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, బండెల నాగార్జున, సీపీఐ కార్యదర్శి దూసరి గోపి పాల్గొన్నారు.

దేశ సేవే ప్రథమం



రోల్ కాల్ తీసుకుంటున్న కల్నల్ భద్ర

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశానికి సేవ చేయడమే ప్రథమిక అంశంగా ప్రతి ఒక్కరూ ఆదర్శంగా నిలవాలని కల్నల్ భద్ర అన్నారు. శనివారం సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ కళాశాలలో నేషనల్ కెడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించి 80మందిని ఎంపిక చేశారు. ఎన్‌సీసీ అనేది కేవలం శిక్షణ కాదని, ఇది జీవితాన్ని మలిచే గొప్ప అవకాశమని, శారీరక ధృడత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతా భావం కలుగుతాయన్నారు. భవిష్యత్తులో వీరికి భారత సైన్యం, ప్రభుత్వ ఉద్యోగాలలో అవకాశాలను ఎన్‌సీసీ కల్పిస్తుందని, చదువులో ముందుకు సాగుతూ దేశానికే సేవ చేయాలనే తలంపుతో ఎన్‌సీసీలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.ఎన్.గోపీ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవ్, ఎన్‌సీసీ కేర్ టేకర్ రవికుమార్, రెహమాన్ పాల్గొన్నారు.